సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
ఆదివారం, 17.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 205
పేజీలు: 08 వెల: రూ. 5



## సరస్వతీ అంత్య పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

- మే 21 నుంచి జూన్ 1 వరకు కాళేశ్వరంలో పుష్కరాలు
- 40 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా

02

## ఇంధన ధరల పెంపు వద్దు



కేంద్రానికి సీఎం రేవంత్ డిమాండ్

- ఎన్నికల హామీలకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరిస్తోంది
- ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపొద్దు
- రూపాయి పతనం, నిరుద్యోగంపై కేంద్రం వైఫల్యం

03

## జూన్ 25 నుంచి ఎస్ఐఆర్



రాష్ట్ర వ్యాప్తంగా బీఎల్‌వోల ఇంటింటి సర్వే ప్రారంభం

- ప్రతి ఓటరుకీ ఎన్యుమరేషన్ ఫారం..
- జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల..
- అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తాం
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి

03

## కేంద్రం ఇవ్వకుంటే మేమిస్తాం



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

- 15-20 రోజుల తర్వాత ఆపిన మొత్తాన్ని విడుదల చేస్తాం
- జూన్ 2న రెండో విడత ఇండ్లు మంజూరు ప్రారంభం
- ఈనెల చివరిలోగా భూముల ధరల సవరణ
- ఈనెల చివరిలోగా భూముల ధరల సవరణ

03

## నమ్మకంగా చేరి దోపిడీ

### నేపాలీ ముఠా చోరీ కేసు ఛేదించిన పోలీసులు



- జూబ్లీహిల్స్ నుంచి జవహర్‌నగర్ వరకు వరుస చోరీలు, హత్యలు
- పని మనుషులుగా చేరి నేరాలకు పాల్పడుతున్న నేపాలీ గ్యాంగ్
- దోపిడీల వెనుక నేపాల్ నుంచి పనిచేస్తున్న మాస్టర్ మైండ్
- నిందితుల కోసం 'ఆపరేషన్ నేపాల్' చేపట్టిన పోలీసులు

**ముద్ర డెస్క్ :**
హైదరాబాద్ నగరంలోని సంపన్న ప్రాంతాలు ఇప్పుడు భయంతో వణికిపోతున్నాయి. పని మనుషుల రూపంలో ఇళ్లలోకి ప్రవేశిస్తున్న కొందరు నేపాలీ ముఠాలు విశ్వాసాన్ని ఆయుధంగా మార్చుకుని హత్యలు, దోపిడీలకు పాల్పడుతున్న ఘటనలు వరుసగా వెలుగుచూస్తున్నాయి. జూబ్లీహిల్స్, నందగిరి హిల్స్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో జరిగిన సంచలన ఘటనలు నగర ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నేపాల్ కేంద్రంగా పనిచేస్తున్న మాస్టర్‌మైండ్‌లను పట్టుకునేందుకు హైదరాబాద్ పోలీసులు ప్రత్యేకంగా "ఆపరేషన్ నేపాల్" ప్రారంభించారు. మూడు నెలల్లో నగరంలో చోటుచేసుకున్న మూడు ప్రధాన ఘటనలు పోలీసులను సైతం ఉలిక్కిపడేలా చేశాయి. ఫిబ్రవరి 6న నందగిరి హిల్స్‌లో ఓ వ్యాపారి ఇంట్లో పనిచేస్తున్న భూపిందర్ షా అనే నేపాలీ యువకుడు సహచర పనివారికి మత్తుమందు ఇచ్చి దాదాపు రూ.2 కోట్ల విలువైన బంగారు ఆభరణాలతో పరారయ్యాడు. మార్చి 14న జూబ్లీహిల్స్‌లో మరో వ్యాపారి ఇంట్లో పనిచేసేందుకు చేరిన ఇద్దరు నేపాలీలు యజమానులు లేని సమయంలో లాకర్లు పగులగొట్టి రూ.3 కోట్ల నగలను దోచుకెళ్లారు. మే 8న విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇంట్లో పనిచేస్తున్న నేపాలీ యువతి యజమాని భార్యను హత్య చేసి నగదు, నగలతో పరారవడం నగరాన్ని కుదిపేసింది.

ఇదిలా ఉండగా సికింద్రాబాద్ జవహర్‌నగర్‌లో జరిగిన మరో సంచలన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. వృద్ధ దంపతులను కట్టేసి భారీ చోరీకి పాల్పడిన నేపాలీ ముఠాలో కీలక నిందితులను అరెస్టు చేశారు. ఈ నెల 12న జరిగిన ఘటనకు సంబంధించి నేపాలీ దంపతులు మమత, రమేశ్‌తో పాటు సబీనా అనే మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి భారీగా బంగారం, వెండి ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం.. కౌకూర్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో నివసిస్తున్న విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ (68), ఆయన భార్య డాక్టర్ విజయలక్ష్మి (58) ఇంట్లో కొంతకాలంగా మమత, రమేశ్ అనే నేపాలీ దంపతులు పని చేస్తున్నారు. యజమానుల నమ్మకాన్ని సంపాదించిన ఈ దంపతులు ముందుగానే చోరీకి పథకం రచించారు. తమ పుట్టినరోజు వేడుకల పేరుతో మరో మిగతా 02లో

## తైవాన్‌కు ట్రంప్ షాక్

### అమెరికా విదేశాంగ విధానంలో యూటర్న్?



- తైవాన్ రక్షణపై చేతులెత్తేసిన డొనాల్డ్ ట్రంప్!
- 'మా చిప్ ఇండస్ట్రీని దొంగిలించారు' అంటూ సంచలన వ్యాఖ్యలు!
- జిన్‌పింగ్ భేటీ తర్వాత మారిన ట్రంప్ స్వరం..
- ఆసియా-పసిఫిక్ రాజకీయాల్లో పెను సంచలనం!

04

తైవాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సంచలన వ్యాఖ్యలు అంతర్జాతీయ రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. చైనా పర్యటన అనంతరం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో.. భౌగోళిక దూరం కారణంగా తైవాన్ రక్షణ విషయంలో వెంటనే స్పందించడం అమెరికాకు కష్టమని పేర్కొంటూనే, తైవాన్ తమ చిప్ ఇండస్ట్రీని దొంగిలించిందంటూ ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు. దశాబ్దాలుగా అమెరికా అనుసరిస్తున్న తైవాన్ అనుకూల విదేశాంగ విధానాన్ని ఒక్కసారిగా మార్చేలా ఉన్న ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

-ముద్ర, డెస్క్:

## భగీరథ్ సరెండర్



కొడుకును విచారణకు అప్పగించిన బండి సంజయ్

- చట్టం ముందు అందరూ సమానమే..
- న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందన్న కేంద్ర మంత్రి
- లాయర్ల సలహాతో ఆలస్యమైందే తప్ప.. తప్పించుకునే ఉద్దేశం లేదని స్పష్టం

02

## పెట్టుబడులతో ఉత్తరాంధ్రకే వలసలు

మూడేళ్లలో నేరడి బ్యారేజ్ పూర్తి

- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- జిల్లాలోనూ 4 వాహనాల కాన్వాయ్‌తో సీఎం ప్రయాణం

04



## పాలమూరు ఎత్తిపోతల రాజకీయం

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పోరుబాట



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**
పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం చుట్టూ తెలంగాణ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. పదేళ్లు అధికారంలో ఉండి ప్రాజెక్టును అసంపూర్తిగా వదిలేశారనే విమర్శలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్.. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో పనులు నత్తనడకన సాగుతున్నాయంటూ క్షేత్రస్థాయి పోరాటానికి సిద్ధమవుతోంది. అధికారం కోల్పోయిన తర్వాత మిగతా 02లో

## జంట హత్యల కలకలం

మొయినాబాద్ ఫామ్ హౌస్ వద్ద ఘటన

- ఇద్దరు మహిళల హత్య
- అప్పు తిరిగివ్వమని అడిగితే ప్రాణాలు తీశారు
- డబ్బులిస్తామని నమ్మించి రప్పించిన దుండగులు
- మృతదేహాలను పూడ్చిన వైనం

03

## 2027 డిసెంబర్ నాటికి దేవాదుల పూర్తి

మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి



- తూర్పు, ఉత్తర తెలంగాణకు 38.16 టీఎంసీల సాగునీరు
- 8 జిల్లాలతో పాటు కరీంనగర్ జిల్లాలోని 5.57 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు

04

## మహిళా సాధికారతే లక్ష్యం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్



- మహిళా సంఘాల వీఓ భవనాలకు శంకుస్థాపన
- మహిళా శక్తి పథకం ద్వారా ఆర్థిక ఎదుగుదల
- ప్రతి గ్రామంలో వీఓ భవనాలు నిర్మిస్తాం

03

## మెగా డీల్


భారత్-యూఏఈ సరికొత్త చమురు మైత్రి



- ఇంధన భద్రతే లక్ష్యంగా చారిత్రక ఒప్పందం!
- హోర్ముజ్ ఉద్రిక్తతల వేళ భారత్‌కు యూఏఈ కొండంత అండ
- దేశ ఇంధన భద్రతకు 30 మిలియన్ బ్యారెళ్ల రక్షణ కవచం!
- గ్యాస్, రక్షణ, పెట్టుబడి రంగాల్లో విస్తృత భాగస్వామ్యం

**ముద్ర డెస్క్ :**
అంతర్జాతీయ చమురు మార్కెట్లలో అనిశ్చితి, పశ్చిమాసియాలో పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్–యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) మధ్య మరో చారిత్రక వ్యూహాత్మక ఒప్పందం కుదిరింది. భారత వ్యూహాత్మక చమురు నిల్వ కేంద్రాల్లో యూఏఈకి చెందిన అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ దాదాపు 30 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును నిల్వ చేయనుంది. అబుదాబిలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ మధ్య జరిగిన అత్యంత కీలకమైన దౌత్య సమావేశం మిగతా 02లో

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 17.05.2026
www.mudranews.in | @mudranews



### ఉక్కపోత: కాటన్ దుస్తులు ధరించాలి



ఉక్కపోతగా ఉన్నప్పుడు కాంతివంతమైన, వదులుగా ఉండే కాటన్ (పత్తి) దుస్తులను ఎంచుకోవాలి. ఇవి గాలి ఆడేలా చేసి, చెమటను త్వరగా పీల్చుకోవడం ద్వారా శరీరాన్ని పొడిగా ఉంచుతాయి.

## నమ్మకంగా చేరి దోపిడీ..



(మొదటి పేజీ తరువాయి)

ఆరుగురు నేపాలీ వ్యక్తులను ఇంటికి రప్పించినట్లు పోలీసులు గుర్తించారు. ఘటన జరిగిన రాత్రి అర్ధరాత్రి తర్వాత ముఠా సభ్యులు ఒక్కసారిగా దాడికి దిగారు. వృద్ధ దంపతులను కట్టేసి బెదిరించి ఇంట్లోని అల్మారాలు తెరిచి దోపిడీకి పాల్పడ్డారు. దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండి, రూ. 30 వేల నగదు, 3 వేల అమెరికన్ డాలర్లను అపహరించి పరారయ్యారు.

కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ దృశ్యాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుల కదలికలను గుర్తించి మమత, రమేశ్, సబీనాలను అరెస్టు చేశారు. విచారణలో మొత్తం ఎనిమిది మంది సభ్యులతో కూడిన నేపాలీ ముఠా ఈ దోపిడీలో పాల్గొన్నట్లు తేలింది. మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

ఇంట్లో పని చేసే వ్యక్తులను నియమించే ముందు వారి పూర్తి వివరాలు, ఆధార్, స్థానిక అడ్రస్, పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయాలని పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. నగరంలో పెరుగుతున్న ఈ తరహా ఘటనలు సంపన్న కుటుంబాల్లో తీవ్ర భయాందోళనలకు దారితీస్తున్నాయి.

## సరస్వతీ అంత్య పుష్కరాలకు భారీ ఏర్పాట్లు

**ముద్ర, హైదరాబాద్:**

కాళేశ్వరంలో ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సరస్వతీ నదీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపడుతోంది. జూన్ 1 వరకు కొనసాగనున్న ఈ పుష్కరాలకు దాదాపు 30 నుంచి 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.

పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వసతి వంటి అంశాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

పుష్కరాల తొలి రోజు శ్రీ జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి, రాష్ట్ర గవర్నర్ పుణ్యస్నానాలు ఆచరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుండగా, భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పుష్కరాల నిర్వహణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రులు సూచించారు. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, స్నానాల కోసం ప్రత్యేక ఘాట్లు, క్యూలైన్లు, తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

# భగీరథ్ సరెండర్

**ముద్ర, కరీంనగర్ :**

పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన కుమారుడు బండి సాయి భగీరథ్‌ను పోలీసుల విచారణకు అప్పగించినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. ''సత్యమేవ జయతే'' అంటూ ప్రారంభమైన తన ప్రకటనలో చట్టంపైనున్న గౌరవంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. "చట్టం ముందు నా బిడ్డైనా, సామాన్యుడైనా సమానమే. అందరం చట్టానికి లోబడే ఉండాలి'' అని బండి సంజయ్ పేర్కొన్నారు. తన కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని పదేపదే చెబుతున్నాడని, ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలనుకున్నప్పటికీ లాయర్ల సలహాతో కొంత ఆలస్యమైందన్నారు.

తమ వద్ద ఉన్న ఆధారాలను అడ్వొకేట్లు పరిశీలించారని, కేసు కొట్టివేయబడే అవకాశముందని, బెయిల్ కూడా తప్పకుండా వస్తుందని వారు చెప్పినట్లు తెలిపారు. అందుకే చట్టపరమైన ప్రక్రియలో భాగంగా కొంత సమయం పట్టిందని వివరించారు. అయితే మరింత ఆలస్యం చేయడం సరికాదని భావించి ఈరోజు స్వయంగా తన కుమారుడిని తీసుకొచ్చి లాయర్ల ద్వారా పోలీసులకు విచారణ కోసం అప్పగించినట్లు వెల్లడించారు.

సోమవారం కోర్టు ఉత్తర్వులు వచ్చే అవకాశమున్నప్పటికీ న్యాయవ్యవస్థపై గౌరవంతో విచారణకు సహకరించాలని నిర్ణయించుకున్నామని బండి సంజయ్ తెలిపారు. "న్యాయ వ్యవస్థపై సంపూర్ణ నమ్మకం ఉంది. నిజం తప్పకుండా వెలుగులోకి వస్తుంది'' అని ఆయన పేర్కొన్నారు.

ఇక ఈ కేసు రాజకీయంగానూ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. భగీరథ్‌పై నమోదైన కేసు, అనంతర పరిణామాలు, పోలీసుల చర్యలు, బండి సంజయ్ స్పందనపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ప్రస్తుతం భగీరథ్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.



# పాలమూరు ఎత్తిపోతల రాజకీయం



(మొదటి పేజీ తరువాయి)

గులాబీ దళం ఉనికి కోసం 'పాదయాత్ర' అస్త్రాన్ని తెరపైకి తెస్తుండగా పదేళ్ల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ డ్రామాలంటూ కాంగ్రెస్ ఎదురుదాడికి దిగుతోంది.

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేతలు అనుసరిస్తున్న వ్యూహంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. గత శుక్రవారం మహబూబ్‌నగర్‌లో సమావేశమైన ఉమ్మడి జిల్లా మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కార్యాచరణ రూపొందించారు. ప్రాజెక్టు ప్రారంభమైన నార్లాపూర్ నుంచి చివరి జలాశయమైన ఉదండాపూర్ వరకు 'పాదయాత్ర' చేపట్టాలని నిర్ణయించారు. ఈ కీలక భేటీకి బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కూడా హాజరై పాదయాత్ర నిర్వహణపై పలు సూచనలు చేశారు.

**బీఆర్ఎస్ వాదన**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా ప్రాజెక్టు పనుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని, ఈ వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని గులాబీ శ్రేణులు చెప్తున్నాయి.

**కాంగ్రెస్ కౌంటర్**

పదేళ్ల పాటు అధికారంలో ఉండి, ప్రాజెక్టును నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు పాదయాత్రలు, తపస్సులు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని అధికార పక్ష నేతలు కొట్టిపారేస్తున్నారు.

**పదేళ్ల పాలనలో 'అరకొర' పనులు.. 'ఆర్భాట' ప్రారంభోత్సవాలు?**

దక్షిణ తెలంగాణకు వరప్రదాయిని అయిన ఈ ప్రాజెక్టుకు 2015లో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శంకుస్థాపన చేశారు. ఐదేళ్లలో పూర్తి కావాల్సిన పనులు ఎనిమిదేళ్లయినా ముగింపునకు నోచుకోలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు, సెప్టెంబరు 16న నార్లాపూర్ వద్ద ఒకే ఒక్క పంపును ఆన్ చేసి కేసీఆర్ హడావుడిగా నీటిని విడుదల చేశారు. కాలువలు, జలాశయాలు అసంపూర్తిగా ఉన్నా.. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఆనాడు ఒక మోటార్‌తో చేతులు దులుపుకున్నారనే విమర్శలు ఉన్నాయి.

**నాడు నోరెత్తని నేతలు..**

కేసీఆర్ హయాంలో జిల్లాకు చెందిన నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి వంటి కీలక నేతలు మంత్రులుగా ఉన్నారు. ప్రాజెక్టు పరిధిలోని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి, అంజయ్య యాదవ్, నరేందర్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, రాంమోహన్ రెడ్డి ప్రాతినిధ్యం వహించారు. కానీ, పనులు సాగుతున్నంత కాలం ప్రాజెక్టును సాగదీస్తున్నారన్న ఆరోపణలు వచ్చినా, ఈ నేతలు ఎన్నడూ కేసీఆర్ వద్ద నోరెత్తలేదనే విమర్శ ఉంది. అధికారం కోల్పోగానే వీరికి పాలమూరు కష్టాలు గుర్తొచ్చాయా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**కాంగ్రెస్ సర్కార్‌కూ తప్పని పరీక్ష**

2023లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ఈ ఉమ్మడి జిల్లాకు చెందిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో ప్రాజెక్టు పనుల్లో వేగం పెరుగుతుందని అంతా భావించారు. గత ఏడాది రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రాజెక్టును సందర్శించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, రెండేళ్లు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో ఆశించిన ప్రగతి కనిపించడం లేదు. కాలువలు, ల్యాండ్ అక్విజిషన్, జలాశయాల పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇదే అంశాన్ని ఆసరాగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని బీఆర్ఎస్ చూస్తోంది.

**పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు స్వరూపం**

ఈ ప్రాజెక్టు దక్షిణ తెలంగాణలోని ఐదు జిల్లాల దాహార్తిని, సాగునీటి అవసరాలను తీర్చే భారీ ఎత్తిపోతల పథకం. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,200 పైగా గ్రామాలకు తాగునీరు.నార్‌కర్నూలు, మహబూబ్‌నగర్, వికారాబాదు, రంగారెడ్డి, నల్గొండలకు మేలు చేస్తుంది. ఎల్లూరు (శ్రీశైలం బ్యాక్ వాటర్) నుంచి లక్ష్మీదేవిపల్లి వరకు.. రోజుకు 1.5 TMC చొప్పున 60 రోజుల్లో 90 TMCల నీటి తరలిస్తారు. మొత్తం 5 లిఫ్టులు, 6 జలాశయాలు (రెండు దశల్లో నిర్మాణం) నిర్మిస్తారు. పంప్‌హౌస్‌లు, జలాశయాలు, పైపులైన్లు (తాగునీరు, పారిశ్రామిక అవసరాలు) వేసి దాహార్తి తీరుస్తారు. సాగునీటి పంపిణీకి అవసరమైన ప్రధాన, ఉప కాలువల నిర్మాణం రెండోదశలో చేపడుతారు.

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కేవలం నీటి సమస్య మాత్రమే కాదు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయ భవిష్యత్తును శాసించే అస్త్రం. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కాంగ్రెస్, ప్రస్తుత ప్రభుత్వ జాప్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ వ్యూహాలు రచిస్తున్నాయి. రాజకీయ పంతాలు ఎలా ఉన్నా, దశాబ్దాలుగా వలసల జిల్లాగా పేరొందిన పాలమూరుకు సాగునీరు అందాలంటే.. మాటల యుద్ధాలు పక్కనబెట్టి పనులను వేగంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉంది.

# మెగా డీల్



(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ఈ భారీ ఇంధన ఒప్పందాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ ఒప్పందం కేవలం చమురు కొనుగోలు–అమ్మకాలకు పరిమితం కాకుండా ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక భద్రత, ఆర్థిక ప్రయోజనాలకు బలమైన పునాదిగా మారనుంది.

**భారత ఇంధన భద్రతకు తిరుగులేని రక్షణ**

ప్రస్తుతం భారతదేశం తన దేశీయ అవసరాల కోసం ఏకంగా 85 శాతం ముడి చమురును ఇతర దేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో అంతర్జాతీయంగా యుద్ధాలు సంభవించినా సముద్ర వాణిజ్య మార్గాల్లో ఆంక్షలు లేదా అడ్డంకులు ఎదురైనా దేశీయంగా ఇంధన కొరత ఏర్పడకుండా భారత్ ఈ వ్యూహాత్మక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన 'హోర్ముజ్ జలసంధి' ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో యూఏఈ ఇక్కడ నిల్వ చేయబోయే 30 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు భారత్‌కు కొండంత అండగా నిలవనుంది. అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే ఈ చమురును భారత్ ఉపయోగించుకునే అవకాశం ఉండటం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు, ఇంధన రంగానికి బలమైన రక్షణ కవచం లభించినట్లవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**యూఏఈకి దక్కే వ్యూహాత్మక ప్రయోజనాలు**

ఈ ఒప్పందం కేవలం భారత్‌కే కాకుండా యూఏఈకి సైతం వ్యూహాత్మకంగా ఆర్థికంగా ఎంతో లాభదాయకం కానుంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటి. భవిష్యత్తులో భారత ఇంధన మార్కెట్ మరింత విస్తరించనుండటంతో ఇక్కడే చమురును నిల్వ చేయడం ద్వారా యూఏఈ తన స్థిరస్థానాన్ని బలోపేతం చేసుకుంటోంది. దీనివల్ల ఆసియా దేశాలకు సరఫరా చేసే సమయం గణనీయంగా తగ్గడమే కాకుండా ఆసియా మార్కెట్లలో తన ప్రభావాన్ని మరింత విస్తరించుకునేందుకు యూఏఈకి గొప్ప అవకాశం లభిస్తుంది.

**గ్యాస్, రక్షణ, పెట్టుబడి రంగాల్లో విస్తృత భాగస్వామ్యం**

ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో ముడి చమురుతో పాటు గ్యాస్ రిజర్వులు, ఎల్పీజీ సరఫరాలు, రక్షణ సహకారం, పరస్పర పెట్టుబడుల అంశాలపై ఇరు దేశాల అధినేతలు విస్తృతంగా చర్చించారు. భారత్ ప్రస్తుతం పర్యావరణహిత ఇంధన వినియోగాన్ని పెంచేందుకు గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో యూఏఈతో దీర్ఘకాలిక ఎల్ఎన్జీ సరఫరా ఒప్పందాలపై ప్రత్యేక చర్చలు జరిగాయి. రానున్న రోజుల్లో భారత గ్యాస్ మౌలిక సదుపాయాల రంగంలో యూఏఈ భారీగా పెట్టుబడులు పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమాసియాలో అస్థిరత పెరుగుతున్న నేపథ్యంలో సముద్ర వాణిజ్య మార్గాల భద్రత, ఉగ్రవాద నిరోధం, ఇంటెలిజెన్స్ సమాచారం పంచుకోవడం.. సంయుక్త సైనిక విన్యాసాలపై ఇరు దేశాలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి.

ఇరు దేశాల మధ్య ఇప్పటికే అమల్లో ఉన్న సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం ద్వారా ద్వైపాక్షిక వాణిజ్యం కొత్త పుంతలు తొక్కుతోంది. మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్, పోర్టులు, పునరుత్పాదక ఇంధనం, టెక్నాలజీ రంగాలలో యూఏఈ పెట్టుబడులు మరింత పెరగనున్నాయి. "భారత్–యూఏఈ భాగస్వామ్యం కేవలం రెండు దేశాల ప్రయోజనాల కోసమే కాదు.. ప్రాంతీయ స్థిరత్వం, ఇంధన భద్రత, ప్రపంచ ఆర్థికాభివృద్ధికి అత్యంత కీలకమైనది. అని భారత ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. "భారతదేశంతో మాకున్న చారిత్రక సంబంధాలు భవిష్యత్తులో మరిన్ని సరికొత్త రంగాలకు విస్తరిస్తాయి. ఈ వ్యూహాత్మక బంధం మరింత బలోపేతం కానుంది." అని యూఏఈ అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ పేర్కొన్నారు.

ఆర్థిక, రాజకీయ, రక్షణ రంగాల్లో అంతర్జాతీయ సమీకరణాలు వేగంగా మారుతున్న తరుణంలో భారత్–యూఏఈ మధ్య కుదిరిన ఈ 30 మిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వ ఒప్పందం ఒక మైలురాయిగా నిలిచిపోనుంది. కేవలం వ్యాపార లావాదేవీల స్థాయిని దాటి.. రెండు శక్తివంతమైన దేశాలు పరస్పర నమ్మకంతో ఒకరి భద్రతకు మరొకరు అండగా నిలుస్తూ ఏర్పరచుకున్న ఈ సుదీర్ఘ వ్యూహాత్మక బంధం భవిష్యత్ అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనుంది.

# బండి భగీరథ్ పై లుకౌట్ నోటీస్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ కేసులో చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకునేందుకు భగీరథ్ దేశం దాటిపోయే అవకాశం ఉందనే అనుమానాలతో పోలీసులు అతడిపై లుకౌట్ సర్క్యులర్ నోటీసులు జారీ చేశారు. దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలు, సరిహద్దు తనిఖీ కేంద్రాలను అప్రమత్తం చేస్తూ శనివారం ఉదయం ఉత్తర్వులు పంపారు. దీంతో పాటు అతడిని పట్టుకునేందుకు సిట్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక పోలీస్ బృందాలను రంగంలోకి దించారు. ప్రస్తుతం భగీరథ్ కోసం హైదరాబాద్, కరీంనగర్‌తో పాటు దేశ రాజధాని ఢిల్లీలోనూ ఈ బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. ఒకవైపు పోలీసులు అరెస్ట్ కోసం లుకౌట్ నోటీసులతో వేట కొనసాగిస్తుండగా.. మరోవైపు చట్టపరమైన రక్షణ కోసం భగీరథ్ చేసిన ప్రయత్నాలకు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని, కనీసం అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ భగీరథ్ దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌పై న్యాయస్థానం ఈ నెల 15న రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు దాదాపు మూడు గంటల పాటు సుదీర్ఘ విచారణ జరిపింది. బాధితురాలి నుంచి సేకరించిన ప్రాథమిక ఆధారాలు, వాంగ్మూలాన్ని పరిశీలించిన జస్టిస్ టి. మాధవీదేవి.. ఈ దశలో నిందితుడికి ఎలాంటి ముందస్తు బెయిల్, అరెస్ట్ నుంచి తాత్కాలిక రక్షణ ఇవ్వలేమని స్పష్టం చేశారు. దర్యాప్తునకు సహకరిస్తామని అంతవరకు అరెస్ట్ ఆపాలని పిటిషనర్ తరఫు న్యాయవాది చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. అయితే దీనిపై తుది నిర్ణయాన్ని వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ సుదీర్ఘ విచారణలో ఇరు పక్షాల న్యాయవాదుల మధ్య తీవ్రమైన చట్టపరమైన వాదనలు జరిగాయి. భగీరథ్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదిస్తూ.. పిటిషనర్‌ను రాజకీయంగా ఇరికించేందుకే కావాలనే కఠినమైన పోక్సో సెక్షన్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారన్నారు. ఇది వాస్తవానికి ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో సాగిన సంబంధమని.. అది ఇటీవల బెడిసి కొట్టడంతోనే కక్షపూరితంగా ఈ కేసు పెట్టారని వాదించారు. అయితే, ఈ వాదనలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు తోసిపుచ్చారు. జీహెచ్ఎంసీ అధికారిక జనన రికార్డుల ప్రకారం బాధితురాలి వయసు స్పష్టంగా 18 ఏళ్ల లోపే ఉందని చట్ట ప్రకారం ఆమె మైనర్ అని కోర్టుకు నిరూపించారు. బాధితురాలు మేజిస్ట్రేట్ ముందు ఇచ్చిన కీలక వాంగ్మూలాన్ని నమోదు చేసిన తర్వాతే కేసు తీవ్రతను బట్టి పోక్సో సెక్షన్లను జోడించాల్సి వచ్చిందని పీపీ స్పష్టం చేశారు.

నిందితుడి తండ్రి కేంద్ర మంత్రి కావడంతో బాధితురాలి కుటుంబంపై తీవ్రమైన ఒత్తిళ్లు, బెదిరింపులు వస్తున్నాయని బాధితురాలి తరపు న్యాయవాది పప్పు నాగేశ్వరరావు న్యాయస్థానం దృష్టికి తీసుకువచ్చారు. ఈ కేసు విచారణ సందర్భంగా.. ఈ సున్నితమైన వ్యవహారంలో తనపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కొన్ని అభ్యంతరకర దుష్ప్రచారాలపై న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు రక్షణ ఇవ్వడానికి నిరాకరించడం.. అలాగే పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసి గాలింపు తీవ్రం చేయడంతో ఏ క్షణంలోనైనా బండి భగీరథ్ అరెస్ట్ అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 17.05.2026
www.mudranews.in | @mudranews



**ఉక్కపోత : కిటికీలు, తలుపుల నిర్వహణ**



పగటిపూట వేడి గాలి లోపలికి రాకుండా కిటికీలకు మందపాటి తెరలు (curtains) వేయాలి. సాయంత్రం వేళల్లో గాలి పారేలా కిటికీలు తెరిచి ఉంచితే ఇల్లు త్వరగా చల్లబడుతుంది.

### ఇంధన ధరల పెంపు నిర్ణయాన్ని

## ఉపసంహరించుకోవాలి

**కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** దేశవ్యాప్తంగా ఇంధన ధరల పెంపు విశ్వాస ఘాతుకమని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అయన ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ధరల పెంపు నిర్ణయం సామాన్యుల పాలిట పిడుగుపాటు లాంటిదని చెప్పారు. ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి ఇంధన ధరలను పెంచడం ద్వారా ప్రజల నడ్డి విరిచారని సీఎం విమర్శించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం ఎన్నికల ముందు "ధరలు పెంచబోం" అని పదే పదే ప్రకటించిన మోదీ ప్రభుత్వం.. ఫలితాలు వచ్చిన పది రోజులు కూడా కాకముందే ఈ నిర్ణయం తీసుకోవడం ముమ్మాటికీ ప్రజల నమ్మకాన్ని వంచించడమేనని విమర్శించారు. ఇది ముమ్మాటికీ విశ్వాస ఘాతుకమని సీఎం ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్న సీఎం... పదేళ్లుగా రూపాయి విలువ పతనం పరాకాష్టకు చేరిందని ఆరోపించారు. 'ఆత్మనిర్భర్ భారత్' అనేది కేవలం ఓట్లు రాల్చే నినాదం గానే మిగిలిపోయిందని, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిని యువత ఉపాధి కోల్పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని చెప్పుకునే కేంద్రం ఈ పెంపును ఎలా సమర్థించుకుంటుందని ప్రశ్నించారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## మహిళా సాధికారత లక్ష్యంగా ముందుకు..

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, కరీంనగర్ :** మహిళల ఆర్థిక సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం సుద్దపల్లి, దోమలకుంట గ్రామాల్లో మహిళా సంఘాల వీఓ భవనాలకు మంత్రి శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ముందుకు సాగుతున్నారని అన్నారు. మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని లక్ష్యంతో మహిళా శక్తి పథకం ద్వారా రుణాలు అందజేసి వారి ఆర్థిక ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. సుద్ధపల్లి గ్రామంలో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో వీఓ భవనం, దోమలకుంట గ్రామంలో రూ. 10 లక్షల అంచనా వ్యయంతో వీఓ భవనానికి శంకుస్థాపన చేశామని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని మహిళా సంఘాలకు వివో భవనాలు నిర్మాణం చేస్తామని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## మలేషియా విమానానికి బాంబు బెదిరింపు

**శంషాబాద్ ఎయిర్ పోర్టులో ల్యాండ్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మలేషియా నుంచి వస్తున్న అంతర్జాతీయ విమానానికి వచ్చిన బాంబు బెదిరింపులు శంషాబాద్ విమానాశ్రయంలో తీవ్ర కలకలం రేపాయి. విమానాన్ని ఏ క్షణంలోనైనా పేల్చేస్తామంటూ గుర్తుతెలియని దుండగులు శనివారం బెదిరించారు. దీంతో పైలట్లు వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అధికారులను అప్రమత్తం చేశారు. శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సెక్యూరిటీ సిబ్బంది, బాంబు స్క్వాడ్ రెస్పాన్స్ టీమ్స్ వెంటనే రంగంలోకి దిగి హై అలర్ట్ ప్రకటించాయి.రన్‌వేపై క్షేమంగా ల్యాండ్తీవ్ర ఉత్కంఠ నడుమ ఎయిర్‌పోర్ట్ అధికారులు అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టడంతో విమానం శంషాబాద్ రన్‌వేపై క్షేమంగా ల్యాండ్ అయింది. ల్యాండింగ్ పూర్తి కాగానే అత్యవసర నిబంధనల ప్రకారం విమానాన్ని రన్‌వే నుంచి హుటాహుటిన ప్రత్యేక ఐసోలేషన్ బేకు తరలించారు. భద్రతా సిబ్బంది ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించి, విమానం తో పాటు వారి లగేజీని కూడా క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ ఘటనతో ఎయిర్‌పోర్ట్ పరిసరాల్లో కాసేపు భయాందోళన వాతావరణం నెలకొంది.

## పాదయాత్ర కాదు.. పొర్లు దండాల యాత్ర చేపట్టాలి

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**



**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేతలు పాదయాత్రలు చేయడం కాదు, పొర్లు దండాల యాత్ర చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్ సీఎల్పీ కార్యాలయంలో శనివారం పాలమూరు జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన పేర్కొన్నారు. అయితే 2015లో అప్పటి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర రావు జూరాల ప్రాజెక్టు స్థానంలో శ్రీశైలం జలాశయం నుంచి నీరు తీసుకొచ్చేలా మార్పులు చేశారని తెలిపారు. మూడు సంవత్సరాల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామని కేసీఆర్ హామీ ఇచ్చినా, అధికారంలో ఉన్న సమయంలో ఒక్కసారైనా సమీక్ష నిర్వహించలేదని ఆరోపించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు 90 శాతం పూర్తయ్యిందని చెప్పడం అవాస్తవమన్నారు. రూ.33,500 కోట్ల అంచనాతో ప్రారంభించిన ప్రాజెక్టుకు తరువాత రూ.55,500 కోట్లతో డీపీఆర్ సమర్పించారని, ఇప్పటివరకు రూ.27 వేల కోట్లు ఖర్చు చేసి 90 శాతం పనులు ఎలా పూర్తయ్యాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.2023 ఎన్నికల ముందు నార్లాపూర్ వద్ద మోటార్ ఆన్ చేసి ప్రచారం చేసుకున్నారని, సీఎం తిరిగి వెళ్లేలోపు మోటార్ ఆగిపోయిందని విమర్శించారు. కాలువల నిర్మాణానికి భూసేకరణ చేయకుండా ప్రాజెక్టు చేపట్టడం బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తి చేయాలంటే రూ.86 వేల కోట్లు అవసరమవుతాయని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుపై రూ.7 వేల కోట్లు ఖర్చు చేశామని, సీఎం అనుముల రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ నేతల పాదయాత్ర "వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రకు వెళ్లినట్టే" అని వ్యాఖ్యానించారు.సమావేశంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి పాల్గొన్నారు.

# జూన్ 25 నుంచి ఇంటింటి ప్రత్యేక సర్వే

**రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌వోల సందర్శన**
**ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారం**
**ఆన్‌లైన్‌లోనూ నమోదు అవకాశం**
**జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల**
**ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు**
**కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం-6**
**అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల**
**రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** వచ్చే నెల 25 నుంచి ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వోలు ప్రత్యేక సర్వే చేస్తారని చెప్పారు. శనివారం హైదరాబాద్ లో ఆహన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రతి ఇంటినీ కనీసం మూడు సార్లు బీఎల్‌వో సందర్శిస్తారన్నారు. కొత్త ఓటర్ల వివరాలను ఫారం–6లో ప్రత్యేకంగా నమోదు చేస్తారన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ అవకాశం ఉందని తెలిపారు. హెల్ప్‌లైన్ 1950తో పాటు 'Book a Call with BLO' సదుపాయం కల్పించినట్లు చెప్పారు. మరోవైపు.. ఎన్యుమరేషన్ దశలో ఫారం తప్ప అదనపు పత్రాలు అవసరం లేదని సీఈవో తెలిపారు. ఫారం ఇచ్చిన వారందరి పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో చేర్చుతారని, ఫారం ఇవ్వని ఓటర్ల జాబితా బూత్ వారీగా ప్రదర్శిస్తారని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్స్ తర్వాత అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. పుట్టిన తేదీ ఆధారంగా పత్రాల సమర్పణకు నిబంధనలు వర్తిస్తాయన్నారు. 1987 జూలై 1కు ముందు పుట్టిన వారికి ఒకే పత్రం సరిపోతుందని.. 1987 – 2004 మధ్య పుట్టిన వారికి తల్లిదండ్రుల వివరాలు కూడా తప్పనిసరి అని చెప్పారు. 2004 తర్వాత జన్మించిన వారికి తల్లిదండ్రుల పత్రాలు తప్పనిసరన్నారు.2002లో రాష్ట్రంలో ఎస్ ఐ ఆర్ చేశారని సీఈవో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలన్నదే ఎస్ఐఆర్ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో 3.45 కోట్ల ఓటర్లు, 35 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. పొలిటికల్ పార్టీలకు కూడా ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్యుమరేషన్ తర్వాత డ్రాఫ్ట్ విడుదల చేస్తామని.. అందులో చూసుకొని ఓటర్లు మార్పు, చేర్పులు చేసుకోవచ్చని వెల్లడించారు.

# కేంద్రం నిధులివ్వకపోతే రాష్ట్రమే భరిస్తుంది

**ఇందిరమ్మ ఇండ్ల నిధులపై కేంద్రం వాటా కోసం ఎదురుచూపులు**
**15-20 రోజుల తర్వాత ఇండ్లకు ఆపిన మొత్తాన్ని విడుదల చేస్తాం**
**జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ప్రారంభం**
**ఈనెల చివరిలోగా భూముల ధరల సవరణ**



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధుల కోసం మార్చి నెల నుంచి ఎదురుచూస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. కేంద్రం నుంచి ఒక్కో ఇంటికి సుమారు రూ.1.13 లక్షల వాటా రావాల్సి ఉందని, ఆ నిధులు వస్తాయనే ఆశతో లబ్ధిదారుల ఫైనల్ బిల్లులను తాత్కాలికంగా నిలిపివేశామని చెప్పారు. మరో 15–20 రోజుల్లో కేంద్రం నిధులు విడుదల చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ఆ భారం భరించి లబ్ధిదారులకు చెల్లింపులు చేస్తుందని స్పష్టం చేశారు.శనివారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి, రాష్ట్రంలో తొలి విడతగా 3.5 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. ఇప్పటికే 1.32 లక్షల ఇండ్లు పూర్తయ్యాయని, జూన్ నెలాఖరుకల్లా మరో 68–72 వేల ఇండ్లలో శ్లాబ్ పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని జూన్ 2న ఆదిలాబాద్‌లో సీఎం అనుముల రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని వెల్లడించారు.రెండో విడతలో గోడలు, బేస్‌మెంట్ లేదా శ్లాబ్ దశలో ఉన్న ఇండ్లకూ మంజూరు కల్పిస్తామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి ఎన్ని ఇండ్లు ఇవ్వాలన్న అంశంపై ఈ నెల 21న జరిగే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, ఫారెస్ట్ భూముల సరిహద్దు వివాదాల పరిష్కారానికి జాయింట్ సర్వే చేపడతామని మంత్రి చెప్పారు. రోవర్స్ సాయంతో సరిహద్దులను ఖరారు చేస్తామని, ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర సర్వే నిర్వహిస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో సర్వర్ సమస్యల పరిష్కారానికి కొత్త సాఫ్ట్‌వేర్ కోసం టెండర్లు ఖరారయ్యాయని, 3–4 నెలల్లో సమస్య తీరుతుందని పేర్కొన్నారు.ఈ నెలాఖరులోగా భూముల ధరల సవరణ చేపడతామని, వాస్తవ మార్కెట్ ధరలకు అనుగుణంగా శాస్త్రీయ పద్ధతిలో కొత్త ధరలు అమలు చేస్తామని వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూముల ధరలను అశాస్త్రీయంగా పెంచిందని విమర్శించారు.అసంపూర్తిగా ఉన్న 2బిహెచ్‌కే ఇండ్లను లబ్ధిదారుల ద్వారానే పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పేదలకు ఇసుక, మట్టి ఉచితంగా అందేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల కబ్జాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ప్రహరీలు నిర్మిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# పనులు పరుగులు పెట్టాలి

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**
**మలక్‌పేట్ రైల్వే స్టేషన్**
**ఆధునికీకరణ పనుల పరిశీలన**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్ నగరంలోని మలక్‌పేట్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న ఆధునీకరణ పనులను గడువులోగా పూర్తి చేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ రైల్వే స్టేషన్‌లో జరుగుతోన్న పనులను శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో కాంట్రాక్టర్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనుల్లో ప్లాట్‌ఫారంల సదుపాయాల మెరుగుదల, ప్రయాణికుల నిరీక్షణ మందిరాలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, పారిశుధ్య సౌకర్యాలు, స్టేషన్ ప్రవేశ ద్వారాల విస్తరణ వంటి పనులను మంత్రి స్వయంగా పరిశీలించారు. పనులు నత్తనడకన సాగుతుండటాన్ని గమనించిన ఆయన, కాంట్రాక్టర్‌ను మందలిస్తూ నిర్ణీత గడువులోపు పనులను పూర్తి చేయాలని కఠిన ఆదేశాలు జారీ చేశారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను వేగవంతం చేయాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని సంబంధిత రైల్వే అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి పని ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు వినియోగించే మలక్‌పేట్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పూర్తయితే ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుబాటులోకి రానున్నాయి. కేంద్ర మంత్రి ఆకస్మిక తనిఖీతో పనులు మరింత వేగం పుంజుకుంటాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ తనిఖీలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ని మంత్రివర్గం నుంచి తొలగించాలి

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసులో పారదర్శక విచారణ జరగాలంటే ఆయనను మంత్రివర్గం నుంచి తొలగించాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. పెట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి సంజయ్ కుమారుడిపై భారతీయ న్యాయ సంహితతో పాటు పోక్సో చట్టం కింద కేసు నమోదైందని ఆమె పేర్కొన్నారు.మైనర్ బాలికకు సంబంధించిన ఈ కేసులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా స్వతంత్రంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని కవిత తెలిపారు. ప్రస్తుతం బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగుతున్నందున దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, సాక్షుల రక్షణపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితురాలికి పూర్తి న్యాయం జరగా లంటే విచారణలో రాజకీయ జోక్యం ఉండకూడదని, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం నిలవాలంటే కేంద్ర ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. దేశంలో మైనర్ల రక్షణ, న్యాయవ్యవస్థ సమగ్రత రాజకీయ ప్రయోజనాల కంటే ముఖ్యమని ప్రధాని గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కేసు దర్యాప్తు, న్యాయస్థాన విచారణ పూర్తయ్యే వరకు సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించాలని కవిత తన లేఖలో డిమాండ్ చేశారు.

# ఇద్దరు మహిళల దారుణ హత్య

**మొయినాబాద్ ఫామ్ హౌస్ సమీపంలో ఘటన**
**అప్పు తిరిగివ్వమని అడిగితే ప్రాణాలు తీశారు**
**డబ్బులిస్తామని నమ్మించి రప్పించిన దుండగులు**
**హత్య చేసి మృతదేహాలను పూడ్చిపెట్టిన వైనం**



**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** తమ అవసరాల కోసం ఇద్దరి దగ్గరి బంధువుల వద్ద అప్పు తీసుకొని తిరిగి అప్పు తిరిగి ఇవ్వమని అడిగినందుకు నమ్మించి నయవంచనకు పాల్పడి ఇద్దరు మహిళలను దారుణ హత్య చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాదులో చోటు చేసుకుంది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాసింపూర్ గ్రామానికి చెందిన అబేదా బేగం(60) అంగన్వాడీ ఆయాగా పనిచేస్తూ ఈనెల 5న ఇంటి నుంచి అదృశ్యమైంది. ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో ఈనెల 10న బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా తాండూర్ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన మహబూబ్ బి (58) ఈనెల 9న అదృశ్యమైంది. దీంతో వారి కుటుంబ సభ్యులు 10న యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేర్వేరు పోలీస్ స్టేషన్లో నమోదైన మిస్సింగ్ కేసుల దర్యాప్తు చేపట్టిన తాండూరు రూరల్ పోలీసులకు తాండూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ లో నివసిస్తున్న భార్యాభర్తలు రెహమాన్ కరిమా బేగమ్ లపై అనుమానం వచ్చింది. దీంతో తమదైన శైలిలో విచారించిన పోలీసులకు దిమ్మతిరిగే విషయాలు బయట పడ్డాయి. అప్పు తీసుకున్న ఇద్దరు భార్య భర్తలు రెహమాన్ (ఆటో డ్రైవర్), కరీమా బేగం లు ముందు వేసుకున్న పథకం ప్రకారం మొయినాబాద్ ఫామ్ హౌస్ లో పనిచేస్తున్న తన బావమరిది తో కలిసి అప్పిచ్చిన ఇద్దరూ వేర్వేరు మహిళలను నమ్మించి పిలిపించి, మొయినాబాద్, చేవెళ్లలోని వేర్వేరు ఫార్మ్‌హౌస్‌లలో దారుణంగా హత్యచేసి అక్కడే పూడ్చి పెట్టారు. ఈ జంట హత్యల కేసు జిల్లా లో తీవ్ర కలకలం రేపింది. మొయినాబాద్ పరిధిలో ఒక మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. చేవెళ్ల పరిధిలోని మరో మహిళ మృతదేహం కోసం అధికారులు గాలిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 17.05.2026
www.mudranews.in | @mudranews



**ఉక్కపోత : చల్లని నీటి స్నానం**

రోజుకు రెండు సార్లు గోరువెచ్చని లేదా చల్లని నీటితో స్నానం చేయడం చాలా మంచిది.ఇది అలసటను దూరం చేసి, శరీర ఉష్ణోగ్రతను తక్షణమే తగ్గించడానికి సహాయపడుతుంది.



# న్యాయం ముసుగులో వివక్ష, మతం మారినా మారని కులముద్ర




ఇండియా సంయుక్త రాష్ట్రాలు అనే ఈ దేశంలో న్యాయం అనే భావన మరోసారి తీవ్రమైన ప్రశ్నల ముందుకు వచ్చింది. ఒడిశా కోర్టులు దళితులు, ఆదివాసీలపై విధించిన అవమాన కరమైన బెయిల్ షరతులను సుప్రీంకోర్టు రద్దు చేస్తూ, మనిషి గౌరవం రాజ్యాంగ హక్కు అని స్పష్టం చేసింది. కులం పేరుతో అవమానాన్ని న్యాయవ్యవస్థ అనుమతించదని తెలిపింది. ఇది గౌరవానికి నిలబడిన తీర్పు.కానీ ఇదే సమయంలో మరో వాస్తవం మన ముందుంది. నాలుగు గోడల మధ్య కులం పేరుతో దూషణ జరిగినప్పుడు, "పబ్లిక్ వ్యూ" అనే సన్నని నిర్వచనంతో దానిని నేర పరిధి బయటకు నెట్టే తీర్పులు కూడా ఉన్నాయి. న్యాయవ్యవస్థలోనే వచ్చిన కొన్ని వ్యాఖ్యలు, ఉదాహరణకు హితేశ్ వర్మ కేసులో వచ్చిన భావన, పబ్లిక్ వ్యూ లో లేకపోతే అది నేరం కాదన్న అర్థాలకు దారితీసింది. కానీ కుల అవమానం ప్రదేశంతో మారదు. అది ఎక్కడ జరిగినా అవమానమే. పబ్లిక్ వ్యూ అనే సన్నని నిర్వచనంతో కుల అవమానాన్ని పరిమితం చేయడం, వాస్తవానికి న్యాయం సారాన్ని చిన్నబుచ్చడమే.

చర్మం రంగును బట్టి వివక్ష చూపే దేశాల్లో పౌరసత్వం మారితే వివక్ష తగ్గుతుందేమో కానీ, కులం పునాదుల మీద కట్టిన దేశంలో మతం మారితే వివక్ష పోదు. కాబట్టి చట్టం కళ్ళకు మతం గంతలు ఉండకూడదు, సామాజిక వాస్తవాల దృక్పథం ఉండాలి. మన దేశంలో కులం మతాన్ని దాటి కొన సాగుతోంది. దళితుడు మతం మారినా అతని మీద సమాజపు చూపు మారడం లేదు. అవమానం, వివక్ష, అణచి వేత అలాగే కొనసాగుతున్నాయి. ఇక్కడే రిజర్వేషన్ అనే ప్రశ్న గట్టిగా నిలుస్తుంది. కులం మూలంగానే అణిచివేత, అస్పృశ్యత, అంటరానితనం, హింస, విద్య నిరాకరణ, దేవాలయ ప్రవేశం నిరాకరణ అన్నీ జరుగుతున్నాయని అంగీ కరించినందుకే రిజర్వేషన్ వచ్చింది. అయితే సమాజం కులాన్ని గుర్తిస్తుంటే, చట్టం మతాన్ని కారణంగా చూపించి హక్కులను నిరాకరించడం స్పష్టమైన ద్వంద్వ వైఖరి. రాజ్యాం గంలోని 14, 15 అధికరణలు సమానత్వాన్ని బోధిస్తుంటే, 1950 నాటి ప్రెసిడెన్షియల్ ఆర్డర్ మతం పేరుతో రిజర్వేష న్లను పరిమితం చేయడం రాజ్యాంగ ఆత్మకు విరుద్ధం అన్న ప్రశ్న తప్పదు.

**కుల నిర్మూలన వేదిక పోరాట దిశ**

ఈ విరుద్ధతల మధ్యే ఒక స్పష్టమైన రాజకీయ, సామాజిక అవసరం ముందుకు వస్తోంది. కులాన్ని కేవలం నియంత్రించే చట్టాలు సరిపోవు. కులాన్ని రద్దు చేసే చట్టం అవసరం. కులాంతర వివాహాలను ప్రోత్సహించడం, కుల గుర్తింపులను రద్దు చేయడం వంటి మౌలిక మార్పులు తెచ్చే "కుల నిర్మూలన చట్టం" అవసరం. ఈ డిమాండ్‌ను కుల నిర్మూలన వేదిక ( కేఎన్వి) తరపున మేము చాలా సార్లు ముందుకు తెచ్చాము. గత 2023 ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలను ప్రశ్నించాము. మీ మ్యానిఫెస్టోలో కుల నిర్మూలన ఉందా అని నిలదీశాము. అనంతరం తెలంగాణ ఎస్సి ఎస్టీ అత్యాచార నిరోధక కమిషన్ కు, బీసీ కమిషన్ కు లేఖలు కూడా ఇచ్చాము. మేము ప్రశ్నించాం మాత్రమే కాదు, పాలసీ అజెండాగా మార్చే ప్రయత్నం కూడా చేశాము. ఇది మా కార్యాచరణకు చరిత్ర. మేము ముందున్నామనే సాక్ష్యం.

కుల వ్యవస్థను రద్దు చేసే చట్టం అసాధ్యం అని చెప్పడం చరిత్రను తిరస్కరించడమే. శూద్రులకు ఆస్తి హక్కు నుండి సతీసహగమన నిషేధం వరకు, బాల్య వివాహ నిషేధం నుండి దేవదాసి వ్యవస్థ రద్దు వరకు, ఎన్నో అమానుష ఆచారాలను చట్టాల ద్వారా నిలిపివేయడం జరిగింది. 1795లో శూద్రుల ఆస్తి హక్కు, 1813లో విద్య హక్కు, 1829లో సతీసహగమన నిషేధం, 1856లో విధవ పునర్వివాహం, 1929లో బాల్య వివాహ నిషేధం వంటి సంస్కరణలు చట్టాల ద్వారానే వచ్చాయి. అవి కూడా వలస పాలన కాలంలో సాధ్యమైనప్పుడు, నేడు కుల నిర్మూలన చట్టం అసాధ్యం అని చెప్పడం ఎంతటి దుర్మార్గం.హిజాబ్, ట్రిబుల్ తలాక్, ఇతర మత ఆచారాలపై చట్టాలు చేసే పాలకులు, కుల వ్యవస్థపై మాత్రం మౌనం పాటించడం యాదృచ్ఛికం కాదు. కులాన్ని తాకితే బ్రాహ్మణీయ, కుల భూస్వామ్య ఆధిపత్య నిర్మాణమే కదులుతుందని వారికి తెలుసు. అందుకే కుల నిర్మూలన ప్రశ్నను తప్పించుకుంటు న్నారు.ప్రజామోదం లేకపోయినా పాలక వర్గాలు తమకు అవ సరమైనప్పుడు చట్టాలు చేశాయి. కార్మికుల ఎనిమిది గంటల పని విధానాన్ని బలహీనపరుస్తూ చట్టాలు తెచ్చారు. రైతు హక్కులను దెబ్బతీసే వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చారు. ప్రభుత్వ రంగాన్ని బలహీనపరుస్తూ ప్రయివేటీకరణ విధానా లను అమలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహి ళలకు ప్రత్యేక కోటా లేకున్నా చట్టం చేశారు. ఒకప్పుడు ఇంది రాగాంధీ ప్రభుత్వం ప్రైవేట్ బ్యాంకులను జాతీయం చేసింది. అంటే రాజకీయ సంకల్పం ఉంటే వ్యవస్థలను మార్చే చట్టాలు సాధ్యమే అని చరిత్రే చెబుతోంది. అలాంటప్పుడు కుల నిర్మూలన చట్టం అసాధ్యం అని చెప్పడం వాస్తవానికి రాజకీయ నిరాకరణ మాత్రమే.

నేడు అవి పూర్తిగా అమలు అవుతున్నాయా లేదా అన్నది వేరే ప్రశ్న. కానీ చరిత్రలో బహుజన వర్గాలు అధికారంలోకి వచ్చి నప్పుడు, సమానత్వ దిశగా చట్టాలను మలచుకునే అవకాశం కూడా ఇలాగే ఏర్పడుతుంది.

**ఐక్యతే మార్గం, విడిపోవడం పాలకుల బలం**

దళితులు, బీసీలు, ఎస్టీలు, మైనార్టీలు వేర్వేరు అనుభవాలు ఎదుర్కొన్నా, మూల సమస్య ఒకటే, కుల ఆధిపత్యం. కానీ ఒక చేదు వాస్తవాన్ని మనం నిజాయితీగా అంగీకరించాలి. బీసీ సమస్యలు వచ్చినప్పుడు దళిత సమూహాలు అదే స్థాయిలో బలమైన ఐక్యతతో ముందుకు రాలేదు. అలాగే దళితులపై దాడులు, అవమా నాలు జరిగినప్పుడు బీసీ సమూహం కూడా చాలా సందర్భాల్లో చూస్తూ మాట్లా డకుండా ఉండిపోయింది. ఈ పరస్పర దూరం యాదృచ్ఛికం కాదు. ఇదే పాలక వర్గాలకు అవసరం. సమాజం విడివిడిగా ఉంటేనే వారి ఆధిపత్యం నిలుస్తుంది.

అందుకే కుల ఉద్యమాలు వేర్వేరుగా ఉన్నా, లక్ష్యం మాత్రం ఒకటే కావాలి. అదే ఐక్యత. అది కూడా కుల నిర్మూలన దృక్పథంతో కూడిన ఐక్యత. ఇదే విషయాన్ని మారోజు వీరన్న ఎన్నాళ్లక్రితమే స్పష్టం చేశాడు. కుల పోరాటాలు విడిగా ప్రారంభమైనా, అవి చివరకు ఒకే దిశలో కలవాలి అని ఆయన చెప్పిన దారి నేడు మరింత అవసరంగా మారింది.

మారోజు వీరన్న వర్ధంతి సందర్భంగా ఆయనను స్మరించు కోవడం అంటే కేవలం నివాళి కాదు. ఆయన చెప్పిన ఐక్యత, పోరాట దిశను ఆచరణలో పెట్టడం. విభజనను దాటి, సమానత్వం కోసం కలిసివచ్చే సంకల్పం. ఒక్కమాట, ఇప్పుడు ఐక్యం కాకపోతే, రేపు ఒక్కొక్కరిగా బలహీనపడటం ఖాయం.

చట్టం ఒక్కటే కులాన్ని కూల్చలేదు. చట్టం విముక్తికి ఒక దారి కావాలి కానీ, వివక్షకు రక్షణ కవచం కాకూడదు. కులం అనేది మనసుల్లో, కుటుంబాల్లో, ఆర్థిక సంబంధాల్లో, రాజకీ యాల్లో, భావజాలంగా బలంగా నాటుకుపోయింది. కాబట్టి కుల నిర్మూలన అనేది ఒక దీర్ఘకాలిక సామాజిక ఉద్యమం కావలి, తప్పనిసరి. పూలే చూపిన దారి, అంబేద్కర్ ఇచ్చిన హెచ్చరిక, మార్క్స్ విశ్లేషణ, ఇవన్నీ ఒకే సత్యాన్ని చెబుతు న్నాయి. బ్రాహ్మణీయ కుల ఆధిపత్య నిర్మాణాన్ని కూల్చకుండా సమానత్వం సాధ్యం కాదు. కులం ఉన్నంత వరకు న్యాయం అసంపూర్తి. మతానికి గంతలు విప్పి, మాన వత్వానికి పట్టం కట్టినప్పుడే రాజ్యాంగం కలగన్న ఇండియా సాధ్యమవుతుంది. కులం కూలకపోతే న్యాయం నిలవదు అన్న సత్యం, ఇంకా సత్యమైనది.

**(మే 16న మారోజు వీరన్న 27 వ వర్ధంతి సందర్భంగా)**



**- పి . రేణుక భూంపల్లి**
**తెలంగాణ మహాత్మాజ్యోతిభా పూలే బీసీ గురుకులాలలో గెస్ట్ ఫ్యాకల్టీ, మన్సూరాబాద్ హైదరాబాద్**

---

బండి భగీరథ్ కాపాడుతున్నది

## రేవంత్ రెడ్డినే..

**-ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

**ముద్ర, హైదరాబాద్:** బండి సంజయ్ తన కొడుకు మైనర్ బాలికపై చేసిన అఘాయిత్యం గురించి రేవంత్ రెడ్డికి ఎప్పుడో చెప్పాడని.. బండి సంజయ్ ఏమని చెప్పాడు, డీజీపీకి ఏం ఆదేశాలు ఇచ్చారో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. నిన్న ఇంటర్వ్యూలో సీఎం రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రంలో నాకు 51 శాతం మంది ఓటు వేస్తే చాలు మిగతా 49 శాతం మంది వేయకపోయినా పర్లేదని అన్నాడు.. అంటే ఈ మైనర్ అమ్మాయి 49 శాతం మందిలో ఉందనా..? మీరు ఆమె గురించి పట్టించుకోవడం లేదు అని ప్రశ్నించారు. 51 శాతం దాంట్లో ఏమో బండి సంజయ్ కుటుంబం ఉంది.. 49 శాతం దాంట్లో ఈ అమ్మాయి ఉందనే మీరు పట్టించుకోవడం లేదా..? మీరు చెప్పాలని డిమాండ్ చేశారు.నా ఎనర్జీ అంతా రాష్ట్రం కోసమే వాడుతున్నా.. నా మీద ఏమేం చేసిర్రో అన్నరు. ఇది తప్పు తప్పు అని చెప్పడానికి నా దగ్గర సాక్ష్యం ఉంది. మీరు ఈ రాష్ట్ర ప్రజల సంపదను రూ.17 కోట్ల 7 లక్షల రూపాయలను కేవలం కేసీఆర్, కేటిఆర్, హరీష్ రావు చేయని నేరానికి ఎట్లా జైలుకు పంపించాలె అన్న కుట్రమీద సుప్రీంకోర్టులో పేరు మోసిన లాయర్లను పెట్టి వృధా చేసిర్రు. ఈ ముగ్గురు నాయకుల మీద చేయని నేరానికి పెద్ద పెద్ద లాయర్లను ఒక్కొక్కరికి రూ.కోటి ఇచ్చి తీసుకొచ్చిర్రని మండిపడ్డారు. నా దగ్గర పూర్తి వివరాలు న్నాయి. రేవంత్ రెడ్డి మీరు కూడా ఒక అమ్మాయికి తండ్రి.. అలాంటిది కనీసం బాధిత కుటుంబానికి ఒక్క ఫోన్ కూడా చేయలేదన్నారు. ప్రతిపక్షాల మీద లాయర్ల కోసం ఇంత ఖర్చు పెట్టే మీరు కనీసం బాధిత మైనర్ కోసం ఒక మంచి లాయర్‌ను ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు.

---

# 2027 డిసెంబర్ నాటికి దేవాదుల పూర్తి

**- తూర్పు, ఉత్తర తెలంగాణాకు 38.16 టీఎంసీల సాగునీరు**
**-మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**




**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని 2027 డిసెంబర్ మాసాంతానికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.దేవాదుల ప్రాజెక్టు ద్వారా తూర్పు, ఉత్తర తెలంగాణ ప్రాంతాలకు 38.16 టీఎంసీల నీటిని అందించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా 8 జిల్లాలతో పాటు కరీంనగర్ జిల్లాలోని 5.57 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందనున్నదని పేర్కొన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి, వ్యవసాయ రంగ బలోపేతానికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారుతుందని చెప్పారు.మొదట రూ.6,016 కోట్ల అంచనాతో ప్రారంభమైన దేవాదుల ప్రాజెక్టు, సవరించిన అంచనాల ప్రకారం ప్రస్తుతం రూ.18,400 కోట్ల వ్యయానికి చేరుకుందని మంత్రి వివరించారు. ఇప్పటి వరకు ప్రాజెక్టుపై రూ.14,422 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మిగిలిన పనులను పూర్తిచేయడానికి మరో రూ.3,978 కోట్లు అవసరమవుతాయని వెల్లడించారు.

ప్రస్తుతం ప్రాజెక్టు పనులు 87.70 శాతం పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు, కాంట్రాక్టు సంస్థలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రంలోని సాగునీటి అవసరాలు మరింత స్థిరపడటంతో పాటు రైతులకు పెద్దఎత్తున లాభం చేకూరుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

---

# పెట్టుబడులతో ఉత్తరాంధ్రకే వలసలు

**స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు**
**జిల్లాలోనూ 4 వాహనాల కాన్వాయ్‌తో సీఎం ప్రయాణం**




**ముద్ర, నరసన్నపేట :** శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కీలక ప్రకటనలు చేశారు. ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్లే పరిస్థితిని మార్చి, ఇక్కడికే పెట్టుబడులు మరియు ఉద్యోగాలు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టు, డేటా సెంటర్లు, ఐటీ కంపెనీలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందు కెళ్తోందని సీఎం తెలిపారు. జూన్ నాటికి రాష్ట్రంలో చెత్త తొలగింపు కార్యక్రమం పూర్తవుతుందని, వ్యర్థాల నిర్వహణకు భారీ ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.

ఇరిగేషన్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం, నేరడి బ్యారేజ్‌కు కేంద్ర అనుమతులు సాధించామని, నవంబర్‌లో శంకుస్థాపన చేసి మూడేళ్లలో పూర్తి చేస్తామని ప్రకటించారు. అలాగే మద్దువలస, హిరమండలం, వంశధార, తోటపల్లి వంటి ప్రాజెక్టులను 2027 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు సాగుతున్నాయని వెల్లడించారు.

రాష్ట్రంలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయని, వాటి ద్వారా 24 లక్షల ఉద్యోగాలు వస్తాయని సీఎం పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం, పేదరికం తగ్గించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

---

## మే 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా యువజన, క్రీడల వేడుకలు

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా మే 18 నుంచి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా "యువజన , క్రీడల వారోత్సవాలు" నిర్వహించనుంది. యువజన సేవలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాల్లో యువతలో ఫిట్‌నెస్, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించనున్నారు.వారోత్సవాల్లో భాగంగా మారథాన్‌లు, యోగా, వాక్‌థాన్‌లు, క్రీడా పోటీలు, యువజన పార్లమెంట్, స్కిల్ డెవలప్‌మెంట్ సెషన్‌లు, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరి రోజు జాబ్ మేళాల్లో ఎంపికైన యువతకు నియామక పత్రాలు అందజేయడంతో పాటు ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సత్కరించనున్నారు.యువత, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వాలంటీర్లు, క్రీడా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం పిలుపునిచ్చింది.

## ఓటర్ల జాబితాపై జాగ్రత్త అవసరం

**- మాజీ మంత్రి తలసాని హెచ్చరిక**



**ముద్ర హైదరాబాద్:** ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన సనత్‌నగర్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన ఎన్యుమరేటర్ మోడల్ ప్రొఫార్మాను ఆవిష్కరించారు. ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని తలసాని సూచించారు. బూత్ లెవెల్ ఆఫీసర్ల నియామకంలో సాంకేతిక పరిజ్ఞానం లేని వారిని పెట్టడం వల్ల గందరగోళం ఏర్పడిందని విమర్శించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్, జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించిన ఆయన, కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. రెండున్నరేళ్ల తర్వాత మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## తైవాన్‌కు షాకిచ్చిన ట్రంప్..

**తైవాన్ రక్షణపై చేతులెత్తేసిన డొనాల్డ్ ట్రంప్!**
**జిన్‌పింగ్ భేటీ తర్వాత మారిన ట్రంప్ స్వరం..**



**ముద్ర డెస్క్ :** తైవాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన సంచలన వ్యాఖ్యలు అంతర్జాతీయ రాజకీయాల్లో పెను దుమారం రేపుతున్నాయి. చైనా పర్యటన అనంతరం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో.. భౌగోళిక దూరం కారణంగా తైవాన్ రక్షణ విషయంలో వెంటనే స్పందించడం అమెరికాకు కష్టమని పేర్కొంటూనే, తైవాన్ తమ చిప్ ఇండస్ట్రీని దొంగిలించిందంటూ ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు. దశాబ్దాలుగా అమెరికా అనుసరిస్తున్న తైవాన్ అనుకూల విదేశాంగ విధానాన్ని ఒక్కసారిగా మార్చేలా ఉన్న ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.అంతర్జాతీయ రాజకీయ యవనికపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తనదైన శైలిలో సంచలనం సృష్టించారు. చైనా పర్యటన ముగించుకున్న అనంతరం ఓ ప్రముఖ అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తైవాన్ అంశంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పెను దుమారం రేపుతున్నాయి. దశాబ్దాలుగా తైవాన్‌కు బాసటగా నిలుస్తున్న అమెరికా విదేశాంగ విధానాన్ని ఒక్కసారిగా ప్రశ్నించేలా ఉన్న ట్రంప్ ప్రకటన చూసి రాజకీయ విశ్లేషకులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ వ్యాఖ్యలు అటు తైవాన్‌లో తీవ్ర ఆందోళనకు కారణమవ్వగా ఇటు చైనా వ్యూహాత్మక వర్గాల్లో హర్షాన్ని వ్యక్తంచేసేలా ఉన్నాయి. ఈ ఇంటర్వ్యూలో ట్రంప్ ప్రధానంగా తైవాన్ రక్షణ విషయంలో అమెరికాకున్న భౌగోళిక పరిమితులను ప్రస్తావించారు. చైనా వంటి అగ్రరాజ్యంతో నేరుగా తలపడటం అంత సులువు కాదని స్పష్టం చేస్తూ తైవాన్ స్వాతంత్ర్య ప్రయత్నాలు ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్నాయని హెచ్చరించారు. "తైవాన్ భౌగోళికంగా చైనాకు కేవలం 95 కిలోమీటర్ల దూరంలో మాత్రమే ఉంది. కానీ మా అమెరికా నుంచి చూస్తే అది 15 వేల కిలోమీటర్లకు పైగా దూరంలో ఉంది. అంత సుదూర ప్రాంతంలో ఒకవేళ యుద్ధం లాంటి అత్యవసర పరిస్థితి వస్తే, వెంటనే స్పందించడం మాకు అత్యంత సంక్లిష్టమైన కష్టతరమైన విషయం." అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

## ఉర్దూ జర్నలిజానికి విశేష సేవలు: ఔసఫ్ సయీద్

**ముద్ర హైదరాబాద్ :** హైదరాబాద్‌లో నిర్వహించిన నసీమ్ ఆరిఫీ ఉర్దూ మీడియా అవార్డ్స్–2026 కార్యక్రమంలో సౌదీ అరేబియాలో భారత మాజీ రాయబారి ఔసఫ్ సయీద్ పాల్గొన్నారు. ఉర్దూ జర్నలిస్టులు నిజాయితీతో సమాజానికి సేవ చేస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ మసూమ్ మొరాదాబాదికి జీవిత సాఫల్య పురస్కారం అందజేశారు. అలాగే డాక్టర్ యామీన్ అన్సారీ, రోహిణి సింగ్, ఫజల్ బేగ్, మహమ్మద్ అలీముద్దీన్‌లకు అవార్డులు ప్రదానం చేశారు. తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ఉర్దూ జర్నలిజానికి ప్రముఖుల సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, రచయితలు, విద్యావేత్తలు పాల్గొన్నారు.



## వెండి దిగుమతులపై కేంద్రం ఆంక్షలు

**ముద్ర , హైదరాబాద్:** పశ్చిమాసియాలో సంక్షోభం వేళ ఇటీవల బంగారం, వెండి దిగుమతులపై సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. తాజాగా మరిన్ని చర్యలు తీసుకున్న ప్రభుత్వం.. వెండి దిగుమతులపై ఆంక్షలు విధించింది. స్వేచ్ఛా విధానం నుంచి పరిమిత విధానానికి సవరించింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని విదేశీ వాణిజ్య విభాగ డైరెక్టరేట్ జనరల్ ఓ నోటిఫికేషన్‌లో తెలిపింది. ఆంక్షల విభాగంలో ఉండే వస్తువులను దిగుమతి చేసుకోవాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 17-05-2026
www.mudranews.in | @mudranews



### ఉక్కపోత : తేలికపాటి ఆహారం

వేసవిలో లేదా ఉక్కపోత ఎక్కువగా ఉన్నప్పుడు జీర్ణం కావడానికి సులువైన, తక్కువ నూనె గల ఆహారాన్ని తీసుకోవాలి. పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లను డైట్‌లో చేర్చుకోవడం ఉత్తమం.



## అంబేద్కర్ కళాభవన్ పనులను పరిశీలించిన మంత్రి జూపల్లి

**ముద్ర ప్రతినిధి, కొల్లాపూర్:** కొల్లాపూర్ పట్టణంలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న అంబేద్కర్ కళాభవన్ నిర్మాణ పనులను జూపల్లి కృష్ణారావు శనివారం పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించిన మంత్రి పనుల పురోగతిని సమీక్షించి, భవన నమూనాను పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి కళాభవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధన్వాడ మండల మత్స్యశాఖ అధ్యక్షుడిగా అచ్చి బాబు



**ముద్ర, నారాయణ పేట:** ధన్వాడ మండల మాత్స్య శాఖ అధ్యక్షుడిగా అచ్చిబాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా మత్స సహకార సంఘం అధ్యక్షులు కాంత్ కుమార్ తెలిపారు. ధన్వాడ మత్స్య సహకార సంఘ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకోగా అధ్యక్షుడిగా అచ్చిబాబు, ఉపాధ్యక్షుడిగా సాయి బాబా, కార్యదర్శిగా రాజు, డైరెక్టర్లుగా నీరటి బాబా, సంద బాలరాజు, చింతకాయల బాలయ్య, సుందరిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష కార్యదర్శులను ఈ సందర్భంగా ఘనం గా సన్మానించి జిల్లాలో ముదిరాజుల సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించి అండగా నిలవాలని కోరారు.

## జనగణన సర్వే పరిశీలించిన ఎంఎంసీ కమిషనర్

**ముద్ర మల్కాజిగిరి:** మౌలాలీలో జనగణన పనులపై కమిషనర్ ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ మౌలాలీలో జరుగుతున్న జనగణన ప్రక్రియను ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ఆనంద్‌బాగ్ మెయిన్ రోడ్, ఏఎన్ఆర్ నగర్ కాలనీలలో జోనల్ కమిషనర్, డీసీ, డీఈలతో కలిసి ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జనగణన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లతో కమిషనర్ మాట్లాడి వారి పనితీరు, విధుల నిర్వహణ, సమయ పాలనపై వివరాలు తెలుసుకున్నారు. హాజరు, పనితీరుపై కఠిన పర్యవేక్షణ ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. జనగణన ప్రక్రియను సమయానికి, ఖచ్చితత్వంతో, సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా..



**ముద్ర, కాప్రా:** కాప్రా జోన్‌లో పద్మశాలి టౌన్ షిప్ లో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శనివారం నుండి చేపట్టిన సమ్మెలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెంట్రింగ్ వర్కర్లకు అనేక సమస్యలు ఉన్నాయని, వారికి రావాల్సిన న్యాయబద్ధమైన హక్కులు అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని, అలాగే 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి కార్మికుడికి పెన్షన్ ప్రకటించాలని ప్రభుత్వానికి తన వంతుగా నివేదిక సమర్పిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మహేష్ గౌడ్, సెంట్రింగ్ నాయకులు కనకరాజ్ గౌడ్, మంచాల మల్లేష్, బాల్దె శ్రీశైలం, కుందనపల్లి మల్లేష్, జహంగీర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## చింతలకుంటలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం




**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి**

జోగులాంబ గద్వాల జిల్లా కేటిదొడ్డి మండలం చింతలకుంట గ్రామంలో శనివారం నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అవగాహన కార్యక్రమంలో రైతులకు వేరుశెనగ సాగులో ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కె. స్రవంతి మాట్లాడుతూ, అధిక దిగుబడినిచ్చే నాణ్యమైన విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి, భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల వినియోగం ఎంతో ముఖ్యమన్నారు. తామర పురుగు, ఆకుతెగులు, వేరుకుళ్లు వంటి సమస్యలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం డా. వై. సంతోషి లావణ్య మాట్లాడుతూ, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని కోరారు. ట్రైకోడెర్మా, రైజోబియం వంటి బయోఫర్టిలైజర్ల వినియోగంతో నేల ఆరోగ్యం మెరుగుపడి అధిక దిగుబడులు సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వై. రాజవర్ధన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి విజయ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## 8వ వార్డులో మద్యపాన నిషేధం..

### - బీఆర్ఎస్ కౌన్సిలర్ జావిద్

**ముద్ర, తాండూర్ ప్రతినిధి:** మద్యపానానికి బానిసై తమ కుటుంబాలను దూరం చేసుకోవద్దని 8వ వార్డ్ బీఆర్ఎస్ కౌన్సిలర్ జావిద్ పేర్కొన్నారు. రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలో మద్యం అమ్మకాలను నిషేధిస్తున్నట్లు తీర్మానం చేయడం జరిగిందని పేర్కొన్నారు ఈ సందర్భంగా. కిరాణా దుకాణ యజమానులు, మరికొందరు బెల్టు షాపులను నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారి వద్దకు వెళ్లి అవగాహన కల్పించి, తీర్మానం చేసిన పత్రాలను అందజేశారు. మద్యపానానికి బానిసై ఎంతోమంది కుటుంబాలను దూరం చేసుకుంటున్నారని, అందరం కలిసికట్టుగా మద్యపాన రహిత కాలనీగా రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీలను తీర్చిదిద్ది అందరికీ ఆదర్శవంతంగా నిలుద్దామని కౌన్సిలర్ జావిద్ సూచించారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్యం

### - డయాలసిస్ కేంద్రానికి 24 గంటల విద్యుత్ సరఫరా
### - మంత్రి జూపల్లి కృష్ణారావు



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్**

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ ఏరియా ఆసుపత్రిని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. పేద, మధ్య తరగతి ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డయాలసిస్ రోగుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా ప్రారంభించినట్లు తెలిపారు. అదనంగా ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. డయాలసిస్ కేంద్రంలో అదనపు బెడ్లు, ఏసీలు ఏర్పాటు చేయడంతో పాటు మరో అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

రూ.22 కోట్లతో నిర్మించిన 100 పడకల నూతన ఆసుపత్రి భవనాన్ని త్వరలో ప్రారంభిస్తామని, పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే రోగుల సౌకర్యార్థం ఆసుపత్రి వద్ద రూ.5 లక్షలతో బస్ షెల్టర్ నిర్మిస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణా రావు తెలిపారు.

# ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం

### - కలెక్టర్ సీహెచ్ ప్రియాంక




**ముద్ర, నారాయణ పేట:**

నారాయణపేట జిల్లాలో భవిష్యత్తులో సంభవించే ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని కలెక్టర్ సీహెచ్ ప్రియాంక తెలిపారు. శనివారం కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో వరదలు, అత్యవసర పరిస్థితులపై ముందస్తు కార్యాచరణను సమీక్షించారు.

కృష్ణా నదిలో వరద ఉద్ధృతి పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని మక్తల్ నియోజకవర్గంలోని నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రత్యేక అప్రమత్త చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ నెల 18న ఉదయం 8 గంటల నుంచి జిల్లాలో ఎంపిక చేసిన 7 ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హిందూపూర్, వాసునగర్‌తో పాటు ఎల్లమ్మ కుంట కాలనీ, మక్తల్ ఏరియా ఆసుపత్రి ప్రాంతాలను మాక్‌డ్రిల్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. నారాయణపూర్ నుంచి 7 లక్షల క్యూసెక్కుల నీరు వస్తే మూడు గంటల్లో కృష్ణా నదిలో వరద ఉద్ధృతి పెరిగే ప్రమాదం ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

అనంతరం మద్దూరు మండలంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, నిల్వ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.



## "మీ సురక్ష" కమ్యూనిటీ పోలీసింగ్ ప్రారంభించిన సిపి సుమతి

**ముద్ర మల్కాజ్గిరి:** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీపీ సుమతి ఆధ్వర్యంలో "మీ సురక్ష" పేరుతో సమగ్ర కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గృహ సహాయకులు, అద్దెదారులు, డ్రైవర్లు, వాచ్‌మెన్‌లు, కేర్‌టేకర్లు తదితర సిబ్బంది వివరాలను సేకరించి ధృవీకరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు భద్రతా చర్యగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. శనివారం కమిషనరేట్ పరిధిలోని 28 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లలో ఒకేసారి ఈ డ్రైవ్ ప్రారంభమైంది. సుమారు 550 ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తూ కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్ సముదాయాల్లో సిబ్బంది వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేస్తున్నారు. ఈ సమాచారం హాక్‌ఐ అల్ట్రా యాప్‌తో పాటు గూగుల్ ఆధారిత ఆన్‌లైన్ ఫారమ్‌ల ద్వారా సేకరించనున్నారు. రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు, అపార్ట్‌మెంట్ సంఘాలతో కలిసి పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రియను సులభతరం చేయనున్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

### - కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్
### - వైభవంగా విద్యా వారోత్సవాలు



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్**

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన విద్యా వారోత్సవాలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక, విద్యా, సృజనాత్మక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గ్రామీణ విద్యార్థుల్లో అపార ప్రతిభ దాగి ఉందని తెలిపారు. సరైన అవకాశాలు, మార్గదర్శకత్వం లభిస్తే వారు ఉన్నత స్థాయికి ఎదగగలరన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన జానపద కళారూపాలు, దేశభక్తి గీతాలు, సామాజిక సందేశాలతో కూడిన నాటికలను కలెక్టర్ అభినందించారు. టీఎల్ఎం ప్రదర్శనలను పరిశీలించి వారి ప్రతిభను ప్రశంసించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య కోసం డిజిటల్ విద్య, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, మౌలిక వసతుల అభివృద్ధి వంటి సంస్కరణలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, నోడల్ అధికారి కురుమయ్య, సెక్టోరియల్ అధికారులు కిరణ్ కుమార్, నూరుద్దీన్, వెంకటయ్య, మురళీధర్ రెడ్డి, శోభారాణి, షర్ఫుద్దీన్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగేశ్వర్ రావు, వివిధ ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు ఒకరు మృతి

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** అయిజ మున్సిపాలిటీ 6వ వార్డ్ పరిధిలోని తుపత్రాలలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శనివారం సాయంత్రం వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటున్న తండ్రి కొడుకులపై పిడుగు పడటంతో కొడుకు అక్కడికక్కడే మృతి చెందగా, తండ్రికి స్వల్ప గాయాలయ్యాయి.

తుపత్రాలకు చెందిన వడ్డే శ్రీనివాసులు (45), అతని కుమారుడు నాగేష్ (25) తమ వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటున్న క్రమంలో ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. ఈ క్రమంలో పిడుగు పడటంతో నాగేష్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి శ్రీనివాసులుకు స్వల్ప గాయాలవడంతో ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ప్రభాతమ్మ నిండు గర్భిణి, రెండు సంవత్సరాల కూతురు కూడా ఉంది.

# డెంగ్యూ నిర్మూలనకు అందరూ ముందుకు రావాలి



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**

జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి ప్రజలకు డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించారు. సమాజ భాగస్వామ్యంతో అందరం కలిసి డెంగ్యూ వ్యాధిని నిర్మూలించాలని ఆయన పిలుపునిచ్చారు. ఏడీస్ దోమ కాటు ద్వారా డెంగ్యూ వైరస్ వ్యాపిస్తుందని, జ్వరం, తలనొప్పి, ఒళ్లునొప్పులు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని సూచించారు. ప్రారంభ దశలో గుర్తిస్తే వ్యాధి సులభంగా తగ్గుతుందని తెలిపారు. వర్షాకాలంలో జ్వరాన్ని నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని, డెంగ్యూ నిర్ధారణ కిట్లు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిని తొలగించి శుభ్రత పాటించాలని, పాత టైర్లు, ప్లాస్టిక్ సీసాలు, కొబ్బరి చిప్పలు వంటి వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ ప్రదీప్, వైద్యాధికారులు డాక్టర్ వాణి, డాక్టర్ సృజన, సీహెచ్‌ఓ వై. శ్రీనివాసులు, ఎంపీహెచ్‌ఈఓలు ఫసియుద్దీన్, రాజేష్, ఆప్తాలమిక్ అధికారి కొట్ర బాలాజీ, ఫార్మసీ అధికారి సురేష్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ కళ్యాణ్ కృష్ణారావు, హెల్త్ అసిస్టెంట్లు రాజవర్ధన్ రెడ్డి, మల్లేష్, ఏఎన్ఎంలు జీజే కవిత, కవిత, సరస్వతి, లక్ష్మి , ఆశా కార్యకర్తలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# పిడుగు పడి 30 గొర్రెలు మృతి

**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**


జిల్లాలోని కొల్లాపూర్ మండలం ఎన్మనబెట్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం, పిడుగుతో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు ఎల గొండ వెంకటయ్యకు చెందిన 30 గొర్రెలు పిడుగుపాటుకు మృతి చెందాయి. ఈ ఘటన వీరమనాయని చెరువు సమీపంలో జరిగింది. వర్షం నుంచి రక్షణ కోసం చెట్ల కిందకు చేరుకున్న గొర్రెల మందపై ఒక్కసారిగా పిడుగు పడటంతో అవి అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో సుమారు రూ.5 లక్షల మేర నష్టం సంభవించినట్లు అంచనా. ఘటనతో రైతు కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. సమాచారం తెలుసుకున్న మాజీ సర్పంచ్ మేకల నాగరాజు ఘటన స్థలానికి చేరుకుని బాధిత రైతును పరామర్శించి ధైర్యం చెప్పారు. అధికారులతో మాట్లాడి తక్షణ సహాయం అందించాలని సూచించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ నిరంజన్ రావు, మాజీ సర్పంచ్ పాశం నాగరాజు, గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 17.05.2026
www.mudranews.in | @mudranews



**ఉక్కపోత:**



ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం తగ్గించడం ఇంట్లో అవసరం లేని లైట్లు, కంప్యూటర్లు, టీవీలను ఆపివేయడం మంచిది. ఎందుకంటే ఇవి ఎక్కువ వేడిని విడుదల చేసి, గది ఉష్ణోగ్రతను మరింత పెంచుతాయి.

# బతికపల్లి సమస్యలు పరిష్కరిస్తా

**- ప్రత్యేక నిధుల ద్వారా మౌలిక సదుపాయాలు కల్పిస్తా**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర, పెగడపల్లి:** మండలంలోని బతికపల్లి సమస్యలను పరిష్కరిస్తానని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం మంత్రి బతికపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పెంట లక్ష్మీబాయి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గ ప్రజలు తనపై విశ్వాసం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు బాధ్యతగా పనిచేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలోని 149 గ్రామాల్లో బతికపల్లి గ్రామానికి ఒక ప్రత్యేకత ఉందని తెలిపారు. సుమారు 7వేల ఓటర్లు ఉన్న బతికపల్లి గ్రామం గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన నియోజకవర్గ ఓటర్ల సమస్యలే పరి ష్కారం ధ్యేయంగా ముందుకు సాగుతున్నానని తెలిపారు. బతికే పల్లి గ్రామంలో రోడ్లు, మురుగు కాలువలు నిర్మాణంతో పాటు మహిళా సంఘాల భవన నిర్మాణం, కుల సంఘాల భవన నిర్మాణాలతో పాటు పల్లె దవాఖాన, ఇతర మౌలిక వసతులు కల్పనకు తన వంతుగా సహకరిస్తానని మంత్రి వివరించారు. స్పెషల్ డెవలప్ మెంట్ ఫండ్ ద్వారా నిధులు కేటాయించి బతికపల్లి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలను ఆదుకుంటున్నాం

**- సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్ :** వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడి చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. నగరంలోని సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన రూ. పన్నెండు లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలుగా అనేక మందిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకున్నామని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉంటూ వివిధ సమస్యలతో వచ్చే వారి కోసం పనచేస్తున్నమన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడి చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని పేర్కొన్నారు. రెండున్నర సంవత్సరాల క్రితం ప్రారంభించిన హెల్ప్ డెస్క్ ఎంతో మంది నిరుపేదలకు సహాయం చేయడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తాను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నానని చెప్పారు. ప్రజల దీవెన ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటున్నానని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. చెక్కులు పొందిన వారిలో తంగెళ్లపల్లి లచ్చయ్య, గౌడుగు పద్మ, బూస రమేష్, సర్దార్ అమరదీప్ కౌర్, సాయిల్ల కొమురవ్వ, చెల్లోజు శివమని, ఉప్పరిపల్లి కనకవ్వ, సర్దార్ గుర్మిత్ సింగ్, తాడూరి అంజలి, సానియా సారహా, చీగిరి దుర్గమ్మ, కొత్త తిరుపతి, కలకుంట్ల రవీందర్ రావు, కల్లేపల్లి శ్రీఖర్, బోడనపు రమాదేవి, లింగంపల్లి శంకరయ్య, ఎర్రోజు శ్రీనివాస్, మీర్జా వాజిద్ బేగ్, మీస కొమురయ్య, ఎడ్ల మల్లమ్మ తదితరులు ఉన్నారు.

## చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

**- రైతులు ఆందోళన చెందొద్దు**

**- జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ప్రభుత్వం చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు కట్టుబడి ఉందని కలెక్టర్ సత్యప్రసాద్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో శనివారం వరకు మొత్తం 2.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుకుందన్నారు. ఇందులో సుమారు 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తేమ పరిమితులకు అనుగుణంగా నమోదైందన్నారు. ఇందులో ఇప్పటివరకు 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్ మిల్లులకు సరఫరా చేశామన్నారు. ఇందుకుగాను 14,544 మంది రైతులకు నేరుగా రూ.260 కోట్ల మొత్తాన్ని వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. ప్రతిరోజూ సుమారు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 500 పైచిలుకు లారీల ద్వారా కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు వేగవంతంగా సరఫరా జరుగుతుందన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 93 రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో ధాన్యం దిగుమతి వేగవంతం చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాలు ఇంకా సుమారు 15 రోజుల్లో ముగింపు దశకు చేరుకోనున్నాయని తెలిపారు. త్వరలోనే ఈ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేస్తామన్నారు.

# కళలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

**- నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** విద్యార్థులకు వివిధ కళారూపాలు మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. నిర్మల్ అర్బన్ మండలం సోఫీనగర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో శనివారం నిర్వహించిన విద్యా వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన హస్తకళలు, సాంస్కృతిక ప్రదర్శనలను కలెక్టర్ పరిశీలించి విద్యార్థులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుత కాలంలో విద్యతో పాటు కళలు, సాంస్కృతిక రంగాల్లో కూడా విస్తృత అవకాశాలున్నాయన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, తహసీల్దార్ రాజు, ఎంఈఓ పద్మ, ప్రిన్సిపాల్ డేనియల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించాలి



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల రూరల్ మండలం చల్గల్ లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించాలని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ వినతి పత్రం అందజేశారు. హైదరాబాద్ లో మంత్రి శ్రీధర్ బాబును శనివారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కలిసి విన్నవించారు. మంత్రి శ్రీధర్ బాబు స్పందించి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఈ విషయం గురించి తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు. అలాగే త్వరితగతిన స్థలం కేటాయించాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్, కేంద్రీయ విద్యాలయం స్థలం కేటాయింపు కోసం గతంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందజేశానని చెప్పారు. స్థలం కేటాయించడానికి జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా పూర్తిగా సహకరిస్తున్నట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు.

# ప్రభుత్వ భూములను రక్షించాలి

**- అదనపు కలెక్టర్ రాజాగౌడ్ కు బీజేపీ నాయకుల వినతి**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జిల్లాలోని నర్సింగాపూర్ లో గల ప్రభుత్వ భూములను రక్షించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ రాజాగౌడ్ కు శనివారం బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నర్సింగాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 437, 251లో ప్రభుత్వ భూమిని కొంతమంది అక్రమంగా కబ్జా చేసుకొని ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. సాధారణంగా ఇటుక బట్టీలు నిర్వహించాలంటే నాలా కన్వర్షన్, ఇతర ప్రభుత్వ అనుమతులు అవసరమన్నారు. కానీ ప్రభుత్వ భూములను ఆక్రమించి వాటిని పట్టా భూములుగా చూపిస్తూ అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నర్సింగాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 437లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని అక్కడే కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ప్రభుత్వ భూములు రక్షించబడటమే కాకుండా జిల్లాలోని పేద విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ల సహకారంతో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చర్యలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. లేకపోతే కేంద్ర నిధులు వృథా అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయ కులు రాజు, సిపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, కౌన్సిలర్ అరవ లక్ష్మి , అంకర్ సుధాకర్, నరెందుల శ్రీనివాస్, బాశెట్టి ప్రభాకర్, లింగాల శ్రీకాంత్ రావు, ఠాకూర్ కిషోర్ సింగ్, ఎడమల వెంకట్ రెడ్డి, పోరండ్ల భిక్ష పతి, ఇత్తడి రాజి రెడ్డి, నవ్వోతు సురేశ్, నాయిని సంజీవ రావు, ఎర్ర శ్రీనివాస్, గోడి శేల నాగరాజు, బుర్ర ప్రమోద్, బిట్టు, సరేల మహేష్ పాల్గొన్నారు.

## చీలమంతుల ఛత్రపతికి సన్మానం



**ముద్ర, కోరుట్ల:** పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గీత సత్సంగ్ ఆధ్వర్యంలో శనివారం చీలమంతుల ఛత్రపతిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గీత సత్సంగ్ అధ్యక్షుడు బచ్చు శ్రీనివాస్ మాట్లాడుతూ సనాతన ధర్మ ప్రచారంలో విశేష సేవలందిస్తున్న ఛత్రపతికి బంగారు పతకం రావడం అభినందనీయమన్నారు. ఈ పురస్కారం కేవలం వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా గీత సేవకు, ఆధ్యాత్మిక విలువలకు, సనాతన ధర్మ ప్రచారానికి దక్కిన గుర్తింపన్నారు. శ్రీమద్భగవద్గీతలోని శ్లోకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లి, యువతలో ధార్మిక చైతన్యం పెంపొందించడంలో ఛత్రపతి చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ఛత్రపతి మరింత కాలం సమాజానికి గీతా మృతాన్ని పంచుతూ సేవ చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సనాతన ధర్మ ప్రచార సమితి అధ్యక్షుడు మంచాల జగన్, చెట్పల్లి శంకర్, వనతడపుల పవన్, యాంసాని ప్రసాద్, గుండేటి బ్రుగు మహర్షి, కట్టెకొల జనార్దన్, జిల్లా శ్రీనివాస్, మంచాల జనార్ధన్, గీత సత్సంగ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయాలి

**ముద్ర, కోరుట్ల:** కథలాపూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ నాయకులతో కలిసి సిరికొండలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనగోలు చేసి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. లేనిచో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి నరెడ్ల రవి, ఉపాధ్యక్షులు అల్లొట్ ప్రమోద్, సీనియర్ నాయకులు బద్రి సత్యం, గాందారి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటు



**ముద్ర, కోరుట్ల;** అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటని బీజేపీ కథలాపూర్ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి అన్నారు. కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించాలనే డిమాండ్ తో శనివారం బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. పోలీసులు మల్యాల మారుతితో పలువురు నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి కథలాపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని అడ్డుకుంటుందని ఆరోపించారు. బీజేపీ ఎపుడు ప్రజల పక్షాన ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల కోసం పోరాడే బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం తగదన్నారు. ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్తుతారన్నారు.


## కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షుల నియామకం

**ముద్ర, కోరుట్ల:** కాంగ్రెస్ పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షుడిగా తిరుమల గంగాధర్, మండల అధ్యక్షుడిగా పన్నాల అంజిరెడ్డిని నియమించారు. ఈ మేరకు శనివారం డీసీసీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన పార్టీ అధిష్టానానికి, నియోజకవర్గ ఇంచార్జి జువాడి నర్సింగరావు, రాష్ట్ర నాయకులు కృష్ణారావు కు కృతజ్ఞతలు తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 17.05.2026
www.mudranews.in | @mudranews



### ఉక్కపోత : ఇండోర్ ప్లాంట్స్ (ఇంటి మొక్కలు)




లివింగ్ రూమ్‌లో కలబంద (Aloe Vera), స్నేక్ ప్లాంట్ వంటి ఇండోర్ మొక్కలను పెంచాలి. ఇవి గదిలోని గాలిని శుద్ధి చేయడమే కాకుండా, వాతావరణాన్ని చల్లబరచడంలో సహాయపడతాయి.

## భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి



**ముద్ర, యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం పునరుద్ధరణలో భూములిచ్చిన తమకు న్యాయం చేయాలని రైతులు, భూ నిర్వాసితులు శనివారం ఈవో కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండ వెనుక భాగంలో ఉన్న తమ భూములను దేవస్థానంకు ఇస్తే తమకు వ్యాపారం చేసుకునేందుకు దుకాణాలు, దేవస్థానంలో ఉద్యోగాలు ఇస్తారనే ఆశతో రూ.కోట్లు విలువ చేసే భూములను అప్పగించామని, కాని ప్రభుత్వ పరిహారం ఇచ్చారని, ఇచ్చిన హామీలు మాత్రం నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కోల్పోయి వ్యవసాయం లేక, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని ఇచ్చిన భూములలో దేవస్థాన వ్రత మండపాలు, వాహన పూజ, అన్నదాన కాంప్లెక్స్, హెలిపాడ్, గోదాం, వాహనాల పార్కింగ్ వంటివి ఏర్పాటు చేసి భక్తులకు సౌకర్యాలు కలుగచేస్తున్నారు కానీ భూ నిర్వాసితులమైన తాము రోడ్డున పడ్డామన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో రోడ్డు ఇరువైపులా ఇండ్లు దుకాణాలు కోల్పోయిన వారికి భూమిపై ఇంటిపై వెలకట్టి ప్రభుత్వ పరిహారంతో పాటుగా ఉండటానికి నివాస స్థలం, కొండ వెనుక భాగంలో దుకాణాలు ఇచ్చినట్లు, కొండ వెనుక భాగంలో దుకాణాల సముదాయాలను కొండపై దుకాణాలు, ఉద్యోగ ఉపా అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.నాగరాజు, నర్సింహా, రాములు, ఆర్.మత్స్యగిరి పాల్గొన్నారు.

## స్వర్ణగిరి స్వామివారికి మంగళహారతులు



సకల దోష నివారణార్థం అమావాస్యని పురస్కరించుకొని స్వర్ణగిరి క్షేత్రంలో శనివారం శ్రీ సుదర్శన నారసింహ హవనం నిర్వహించారు. ఆలయంలో శ్రీస్వామి వారికి ప్రాతఃకాలంలో సుప్రభాత సేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించారు. శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు, పసుపు,సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్ఛారణలతో వసంతోత్సవ సేవను శోభాయమానంగా చేశారు. నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ అనంతరం స్వామివారు ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. జల నారాయణ స్వామివారికి మంగళహారతులు సమర్పించారు. – ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### మండల న్యాయ సేవా సదస్సులో జడ్జి ఎండి గౌస్ పాషా



**ముద్ర, తుంగతుర్తి:** ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది మానవత్వంతో ఆదరిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించడం వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరి బాధ్యత అని తుంగతుర్తి జూనియర్ కోర్టు సివిల్ జడ్జి ఎండి గౌస్ పాషా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో మండల న్యాయ సేవాసాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రికి వైద్య సేవల కోసం వచ్చే రోగులకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన సలహాలు సూచనలను సిబ్బంది వారికి వివరించాలని తెలిపారు. రోగుల యొక్క వివరాలను గోప్యంగా ఉంచాలని వారి యొక్క మానవ విలువలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. వైద్య సేవలు అందించే సమయంలో ఎవరైనా విధులకు ఆటంకం కలిగిస్తే చట్టాలు ఉన్నాయి అని వైద్య సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా తమ దృష్టికి వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. అంతకుముందు ఆస్పత్రిలోని ఓపి రిజిస్టర్ పరిశీలించి, గదులను కలియ తిరుగుతూ మందులు, పరీక్ష ల్యాబ్ ను పరిశీలించి స్వయంగా రోగులతో ఆప్యాయంగా మాట్లాడుతూ అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మల్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నేపర్తి జ్ఞాన సుందర్, తుంగతుర్తి ఇన్చార్జి సీఐ నాగేశ్వరరావు, ఎస్సై క్రాంతి కుమార్, న్యాయవాదులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పొదుపు పేరుతో మోసం చేస్తున్న మోడీ

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పొదుపు పేరుతో ప్రజలను మోడీ ప్రభుత్వం మోసం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు విమర్శించారు. ప్రజలను సౌకర్యాలు తగ్గించుకోమని చెప్పి విదేశాల్లో మోడీ ఎంజాయ్ చేస్తున్నాడని వారు ఎద్దేవ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సుందరయ్య భవన్, భువనగిరిలో జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభలు రామన్నపేట మండల కేంద్రంలో మే 18, 19 తేదీలలో నిర్వహిస్తున్నామని ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండి. జహంగీర్ పాల్గొంటున్నారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, రాచకొండ రాములమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు జూకంటి పౌల్, జిల్లా సహాయ కార్యదర్శులు సిరిపంగి స్వామి, గుంటూరు శ్రీనివాస్ చారి, సల్లూరి కుమార్, కూకుట్ల చుక్కాకుమారి జిల్లా కమిటీ సభ్యులు దొడ్డి బిక్షపతి, బోయ యాదయ్య, చింతకాయల నరసింహ, కొండాపురం యాదగిరి, శ్రీనివాసరావు, రాపోతు పద్మ, మానే సాలయ్య, బొల్లేపల్లి కిషన్, ఎర్ర ఊషయ్య పాల్గొన్నారు.

## ఫెర్టిలైజర్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



**ముద్ర, భూపాల్‌పల్లి:** ఫెర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నాగూర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని టిపిఆర్ ఫంక్షన్ హాలులో ఫెర్టిలైజర్స్, ఫెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా యాంసాని వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షులుగా కట్కం అశోక్, ఉపాధ్యక్షులుగా నలిగేటి సతీష్, ప్రధాన కార్యదర్శిగా పుప్పాల రాజు, కోశాధికారిగా కందునూరి శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా తొగరి శ్రీనివాస్, తడకల జగదీష్, కార్య నిర్వాహక కార్యదర్శిగా ఒల్లాల రాంబాబు, కార్యదర్శిగా లింగంపల్లి తిరుపతి, సహాయ కార్యదర్శిగా లింగంపల్లి బాబురావులతోపాటు మరో 22 మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నాగూర్ల వెంకటేశ్వర్లు నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి మాట్లాడుతూ జిల్లాలోని ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ బలోపేతానికి నూతన కమిటీ కృషి చేయాలని, జిల్లాలో డీలర్లకు ఏవైనా సమస్యలు ఎదురైనట్లయితే ముందుండి పోరాడాలని సూచించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేపించారు. కార్యక్రమంలో ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు, డీలర్లు, అన్ని కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పెట్రో ధరల పెంపును నిరసిస్తూ ధర్నా







### కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టొద్దు
### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం వరుసగా పెంచడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. శనివారం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ భువనగిరిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని నెల్లికంటి సత్యం మాట్లాడారు. గాదేగాని మాణిక్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య, బచ్చనగోని గాలయ్య, చేక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, పెరబోయిన మహేందర్, యేశాల అశోక్, జిల్లా సమితి సభ్యులు కళ్ళేపల్లి మహేందర్, సోమన సబిత, అన్నెపు వెంకట్, మరుపాక వెంకటేష్, అన్నేమైన వెంకటేష్, ఇంజ హేమలత, చాపల అంజయ్య, కలకొండ సంజీవ, దాసరి లక్ష్మయ్య, బబ్బురి శ్రీధర్, మూల పోచయ్య, వడ్లకొండ భారతమ్మ, కాషపాక దయాకర్ పాల్గొన్నారు.

**సిపిఎం ఆధ్వర్యంలో..**

పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు ఉపసంహరించుకుని జీఎస్టీ పరిధిలోకి తేవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. శనివారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రైతు బజార్ వద్ద కేంద్ర ప్రభుత్వంపై నిరసన కార్యక్రమం చేశారు. పట్టణ సిపిఐఎం కార్యవర్గ సభ్యులు బందల ఎల్లయ్య, వనం రాజు, కమిటీ సభ్యులు వల్లాస్ అంజయ్య, చింతల శివ, ఈర్ల రాహుల్, జూకంటి పావుల్, జగ్గులు పాల్గొన్నారు.

**సూర్యాపేటలో..**

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** కేంద్రం లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, సి ఎన్ జి గ్యాస్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచిందని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో వాణిజ్య భవన్ సెంటర్లో ఆటోలను తాళ్లతో లాగుతూ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, గీత పనివారాల సంఘం జిల్లా అధ్యక్షులు రేగటి లింగయ్య, పట్టణ కార్యవర్గ సభ్యులు చామల అశోక్ కుమార్, దీకొండ శ్రీనివాస్, పట్టణ మైనార్టీ నాయకులు ఎండి పాషా, ఏఐవైఎఫ్ గౌరవ పట్టణ అధ్యక్షులు కుక్కడప్పు శౌరి, పట్టణ కార్యదర్శి ఎడెల్లి శ్రీకాంత్, పూన్నం రమేష్, కామేష్, గురుస్వామి, మహిళా సంఘం నియోజకవర్గ నాయకురాలు పొదిల వెంకటమ్మ, దంతాల పద్మ రేఖ, దేశ గాని హేమలత, సివిల్ సప్లై హమాలీ నాయకుడు వెంకన్న పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన**

**ముద్ర, తుంగతుర్తి:** మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఆటోను తాడుతో లాగుతూ మెయిన్ రోడ్డు పై నిరసన తెలియజేశారు. బిఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్. మండల నాయకులు మల్యాల రాములు. సోమేష్. గోపగాని శ్రీనివాస్. గుండగానీ లక్ష్మయ్య. మల్లేష్. సింహాద్రి. సర్పంచ్ రమేష్.. మహేష్. కదారి దాసు. ఉప్పల వీరయ్య. యాకూబ్, రవి. వీరోజీ నాయక్. యాకూబ్. తదితరులు పాల్గొన్నారు

## జూలై 12న హైదరాబాదులో బీసీల రాజకీయ ప్లీనరీ

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** 2028 లో బీసీలు తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టడం ఖాయమని, తెలంగాణ గడ్డ బీసీలకు అడ్డాగా మారిందని ఈ సునామీని ఎవరు ఆపలేరని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర మల్సూర్ గౌడ్ నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజ్యాధికారం లక్ష్యంగా బీసీ సమాజంలో రాజకీయ చైతన్యం పెరిగిందని చెప్పారు. పిడికెడు శాతం ఉన్న వారి పాలన ఇంకెన్నాళ్ళని ప్రశ్నించారు. బీసీలు బలమైన శక్తిగా ఎదిగారని ఇక అగ్రకులాల ఆటలు సాగవని అన్నారు. జూలై 12న హైదరాబాదులో బీసీల రాజకీయ ప్లీనరీ, ఆగష్టు 7న జాతీయ ఓబిసి సమావేశం, సెప్టెంబర్లో బీసీల రాజ్యాధికార రథయాత్ర రాష్ట్రవ్యాప్తంగా మూడు నెలలు పల్లె నుంచి పట్టణ వరకు రాజకీయ దామాషా రాజ్యాధికారమే లక్ష్యంగా కొనసాగుతుందని, హైదరాబాదులో డిసెంబర్ లో 10 లక్షల మందితో రాజకీయ యుద్ధభేరిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం , బీసీ ఐకాస చైర్మన్ జాజుల లింగం గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఉప్పల మధు యాదవ్,బీసీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లంకొండ రామమూర్తి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చలమల్ల నరసింహ, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నిద్ర సంపత్ నాయుడు, బీసీ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ సైదులు, ప్రధాన కార్యదర్శి నేరెళ్ల దేవరాజు యాదవ్, అసోసియేటెడ్ అధ్యక్షుడు మామిడి శ్రీనివాస్ యాదవ్, గౌరవ అధ్యక్షుడు పోతురాజు నరసయ్య, జిల్లా కన్వీనర్ సూర్య గౌడ్, రాచకొండ సురేష్ గౌడ్, బైరు విజయకృష్ణ,తండు అంజయ్య, అబ్బగాని వెంకటయ్య, పిల్లుట్ల శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు

## డివైడర్ కు ఢీకొని వ్యక్తి మృతి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** మండలం కూనూరు గ్రామానికి చెందిన వడి గిరి(36) శనివారం భువనగిరిలో ఆటో నడుపుతుండగా మధ్యాహ్నం పాత బస్టాండ్ కెనరా బ్యాంక్ ఎదురుగా ఆటో అదుపుతప్పి డివైడర్ను ఢీ కొట్టగా మెడ వద్ద తీవ్ర గాయం కావడంతో ఏరియా హాస్పిటల్ కు తరలించగా అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## టిప్పర్ లారీ ఢీకొని మహిళ మృతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాసుకుంట వద్ద శనివారం భార్య భర్తలు ప్రయాణిస్తున్న బైక్ ను టిప్పర్ లారీ ఢీ కొట్టగా భార్య కింద పడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వీరిదిమూటకొండూరు మండలం ఆరెగూడెం కు చెందిన బరిగే నర్సంహ్మా దంపతులుగా గుర్తించారు.

## బర్రెలను అపహరించే ముగ్గురు దొంగల అరెస్టు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** బర్రెలను అపహరించే దొంగలను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు భువనగిరి సబ్ డివిజన్ డీఎస్పి రవీందర్, రూరల్ సీఐ చంద్రబాబు తెలిపారు. భువనగిరి మండలం తాజ్పూర్ గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ కర్కపట్ల లోని ఒక ప్రైవేటు కంపనిలో పని చేస్తున్న మహబూబ్, పోతిరెడ్డి మల్లారెడ్డి కలిసి బర్లను దొంగతనం చేసి, నాగాయపల్లి తాండకు చెందిన బర్ల వ్యాపారి ధరావత్ హట్టు అమ్ముతున్నారని, వీరి వద్ద నుంచి పది బర్రె లు, ఒక దూడ స్వాధీనం చేసుకోని రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. భువనగిరి రూరల్ ఎస్ ఐ శివ శంకర్ రెడ్డి, క్రైమ్ హెడ్ కానిస్టేబుల్ నారాయణరెడ్డి, కానిస్టేబుళ్లను అభినందించారు.

# కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

### టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా విద్య విజయోత్సవం 2025–26 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి మంచి విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. జిల్లాలో ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అద్భుతమైన ఉత్తీర్ణత ఫలితాలు రికార్డు స్థాయిలో జిల్లా, మండల స్థాయిలో సాధించినందుకు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్మీడియట్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 9 మంది విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.10 వేల క్యాష్ అవార్డులు అందించి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, డీఈవో సత్యనారాయణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి సాహితి, టీజీవో అధ్యక్షులు మందడి ఉపేందర్ రెడ్డి, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోజుకు 15 వేల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం

**ముద్ర, సూర్యాపేట జిల్లా ప్రతినిధి:** జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులతో ధాన్యం సేకరణపై వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు.కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రస్తుతం అనుకున్న స్థాయిలో ధాన్యం సేకరణ జరగడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎస్ఓ మోహనబాబు, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఎం సివిల్ సప్లయస్ శ్రీధర్ రెడ్డి, డిఎంఓ నాగేశ్వర శర్మ, ఎఎస్ఓ శ్రీనివాస్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 17.05.2026
www.mudranews.in | @mudranews



**ఉక్కపోత: సహజసిద్ధమైన గాలి**

టేబుల్ ఫ్యాన్ ముందు గిన్నెలో ఐస్ ముక్కలు ఉంచడం ద్వారా చల్లని గాలిని పొందవచ్చు. రాత్రి కాసేపు మిద్దె లేదా బాల్కనీలో గడపడం వల్ల ఉపశమనం లభిస్తుంది.



# ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలి

**- మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** రైతుల ధాన్యాన్ని సమయానికి తూకం వేసి త్వరగా సంబంధిత మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం రామాయంపేట మండలం అక్కన్నపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. టోకెన్ విధానం అమలులో ఉందా అనే అంశాన్ని పర్యవేక్షిస్తూ, నిబంధనలు పక్కాగా పాటించాలని సూచించారు. కేంద్రాల్లో, గోనె సంచులు సరిపడా అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,32,992 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని తెలిపారు. 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 533 కేంద్రాల్లో, 519 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కోసం పనిచేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు.

**నిబంధనలు పాటించిన రైస్ మిల్లులపై చర్యలు తీసుకుంటాం..**

నిబంధనలు పాటించని రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు. పలు మార్లు ఆదేశించినా మేసర్స్ శ్రీ సాయి లక్ష్మీ ట్రేడర్స్, మేసర్స్ భవా ని ఇండస్ట్రీస్ కు పీపీసీల నుండి కేటాయించిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. రైస్ మిల్లులను పాడి ప్రొక్యూర్మెంట్, కస్టమ్ మిల్లింగ్ ఆపరేషన్స్ నుండి బ్లాక్‌లిస్ట్ లో పెట్టినట్లు తెలిపారు. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయా రైస్ మిల్లులకు ఎటువంటి ధాన్యం కేటాయింపు చేయబడవని వెల్లడించారు.

## జనగణనలో భాగస్వాములు కావాలి



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జనగణనలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు. శనివారం రామాయంపేట మండలం అక్కన్నపేట్ గ్రామంలో జనగణన 2027 ఇండ్ల గుర్తింపు కార్యక్రమాన్ని ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ రజనీ, ఎంపీడీవో, సర్పంచ్ తో కలిసి క్షేత్రస్థాయిలో కలెక్టర్ పర్యటించి హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా గణన, గృహ బాబితా కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు ఖచ్చితమైన వివరాలను అందించాలన్నారు. సేకరించిన వివరాలన్నీ గోప్యంగా ఉంటాయాని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అనుభవజ్ఞులైన సిబ్బందిని జనగణన సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లుగా నియమించి వారికి అవసరమైన శిక్షణ అందించామన్నారు. ఈ నెల 11 నుండి జూన్ 9 వరకు జరిగే ఇండ్ల గణన సర్వేను పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లను ఆదేశించారు.

## వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి



**ముద్ర, హైదరాబాద్:** వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. విద్యా వారోత్సవాల సందర్భంగా జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో బాల భవన్‌లో శనివారం కళా వైభవం– కలర్స్ ఆఫ్ చైల్డ్ హుడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తూ, వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాలు ఎంతో ఉపయెగపడుతున్నాయని తెలిపారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను శిక్షణా శిబిరాల్లో చేర్పించాలని సూచించారు. ఈ శిక్షణ ద్వారా పిల్లల్లోని సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని తెలిపారు.

# ఖరీఫ్ లో సన్న వడ్లు పండించాలి

**- సిద్దిపేట కలెక్టర్ హైమావతి**



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:** వచ్చే ఖరీఫ్ సీజన్ లో సన్న వరి ధాన్యం పండించేందుకు ప్రతి రైతు ముందుకు రావాలని కలెక్టర్ కె.హైమావతి పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో ధాన్యం దిగుమతి ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ లో ఐదు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంచేందుకు అవసరమైన రెండు గోదాములు ఉన్నాయన్నారు. ఈ గోదాముల్లో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల ధాన్యం డౌన్ లోడ్ చేస్తున్నామని తెలిపారు. ఒక గోదాములో దాదాపు పూర్తిగా నిండిందన్నారు. ఇంకో గోదాం లో ఉన్న గన్ని బ్యాగులను వేరొక గోదాములకి తరలించి ఇందులో కూడా ధాన్యాన్ని దిగుమతి చేయాలని తెలిపారు. అకాల వర్షాల వలన రైతులు నష్టపోకుండా ఈ మార్కెట్ కమిటీ గోదాములో ప్రస్తుతానికి ధాన్యం ఉంచుతున్నట్లు చెప్పారు. ఈ ఏఎంసీలో ని హమాలీలు ఇందులో మాత్రమే పని చేయాలని, బయటికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని చైర్మన్ తిరుపతి రెడ్డికి సూచించారు. ఏఎంసీలో రైతులతో మాట్లాడుతూ సన్న వడ్లకు బోనస్ తో పాటు మన జిల్లాలో పండించిన బియ్యం జిల్లాలోని ప్రజలకు సరిపోతుందన్నారు. రేషన్ షాప్ లలో సన్న బియ్యం సరిపోక వేరే జిల్లాల నుంచి తెస్తున్నట్లు తెలిపారు. అందుకే రైతులు సన్న వరి పండించాలని కోరారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రామ్మూర్తి, ఏసీపీ సదానందం, తహసీల్దార్ లక్ష్మా రెడ్డి తదితరులు ఉన్నారు.

**ఉత్తర తెలంగాణ వార్తలు..**

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**ముద్ర, కోరుట్ల:** జిల్లాలో ధాన్యం కొనుగోలు, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కథలాపూర్ మండలంలోని సిరికొండలో గల కొత్త సురేష్, జీకేఎస్చ అమీర్ రైస్ మిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా మిల్లులలో ధాన్యం నిల్వలు, మిల్లింగ్ ప్రక్రియ, లోడింగ్, అన్‌లోడింగ్ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ రమేష్ పాల్గొన్నారు.



## నానో యూరియా వాడకం పెంచాలి

**ముద్ర, హైదరాబాద్:** నానో యూరియా వాడకం పెంచాలని ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సిరిసిల్ల శాస్త్రవేత్ర తబస్సుం ఫాతిమా రైతులకు సూచించారు. నిజామాబాద్ జిల్లాలోని బీర్కూర్‌లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్ర తబస్సుం ఫాతిమా మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలన్నారు. ఇన్‌చార్జి ఏవో శివకుమార్, ఏఈవో మీనా, రైతులు పాల్గొన్నారు.

## ధరల నియంత్రణలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విఫలం



**ముద్ర, హైదరాబాద్:** ధరల నియంత్రణలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీ సుధాకర్, కోటగిరి మండల కార్యదర్శి విఠల్ గౌడ్ ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలకు నిరసనగా అంబేద్కర్ చౌరస్తా వద్ద శనివారం ట్రాలీ ఆటోకు తాడు కట్టి లాగుతూ ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడం దారుణమని, వెంటనే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలు, సామాన్యులు, చిరు ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. సామాన్యుల నడ్డి విరిచేలా పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారని మండిపడ్డారు. ఇంకా పొదుపు మంత్రం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియడంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోడీ 12 ఏళ్ల పాలనలో అన్నింటి విఫలమయ్యారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో రూ.300 ఉన్న గ్యాస్ ధర బీజేపీ హాయంలో రూ.1000కి పైగా చేరుకోవడంతో పాటు ప్రజలకు 45 రోజుల గ్యాస్ దొరికే పరిస్థితి లేదని మండిపడ్డారు. చిరు వ్యాపారులకు కమర్షియల్ గ్యాస్ దొరకక హోటల్లు మూతపడడే పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశంలో కార్పొరేట్ సంస్థలకు సబ్సిడీలు పెంచి ప్రజలపై ప్రత్యక్ష భారాలు మోపడం సరికాదని ధ్వజమెత్తారు. బీజేపీ హయాంలోనే పెట్రోల్ డీజిల్ గ్యాస్ పై జీఎస్టీ తెచ్చిందని పెట్రోల్, డీజిల్ పై జీఎస్టీ ఎత్తివేస్తే ధరలు తగ్గుతాయని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజల పక్షాన ఆందోళన, నిరసన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నల్ల గంగాధర్, నీలి శంకర్, రాజు, రాములు, హనుమండ్లు, అన్సార్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## సాగునీరు ఆదా చేయాలి



**ముద్ర, హైదరాబాద్:** సాగునీరు ఆదా చేయాలని శాస్త్రవేత్త అశ్విని రైతులకు సూచించారు. నిజామాబాద్ జిల్లా బాన్సువాడ మండలంలోని పోచారంలో సర్పంచ్ కేతావత్ రమేష్ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త అశ్విని రైతులకు పలు సూచనలు చేశారు. తక్కువ యూరియాను వినియోగించి సాగు ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. భూసారాన్ని రక్షించుకోవాలని, అవసరం మేరకే రసాయనాలు వినియోగించాలని రైతులకు సూచించారు. పంట మార్పిడి పద్ధతులు పాటించాలన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై ముఖ్యమైన సమాచారాన్ని రైతులకు అందించారు. పలు మేలు రకపు వంగడాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో మీఫ్తా ఫైజులా, ఏఈఓ దత్తతేశ్వరి, ఉపసర్పంచ్ షైక్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ తెలిపారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన టాస్క్, కెరీర్ గైడెన్స్ సెల్, మాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు జిల్లా నలుమూలల నుంచి ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన దాదాపు వంద మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 11 మందిని వివిధ ఉద్యోగాలకు నేరుగా ఎంపిక చేయగా, మరో 82 మందిని తదుపరి దశ ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు చదువుతో పాటు మంచి ఉపాధి అవకాశాలు అందించాలనే ఉద్దేశంతోనే జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఎంపిక కాని అభ్యర్థులు నిరుత్సాహ పడకుండా లోపాలను సరిదిద్దుకోవా లని సూచించారు. కళా శాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యూ. గంగాధ ర్, టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. రజిత, కెరియర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ కె. రమేష్ రెడ్డి, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి బాలకృష్ణ, టాస్క్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సాయి కుమార్, వివిధ కంపెనీల ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ పీజీ రెడ్డి, జాకిర్ హుస్సేన్, డాక్టర్ సూర్య సాగర్, సుభాష్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హేమలత, అర్చన తదితరులు పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com